# అశిక్ష అవిద్య

శ్రీ రామారావు తమ్ముడి పెండ్లికి ఏర్పాటులన్నీ మహాఘనంగా జరిగినవి.

పెండ్లి కన్యాదాతల స్వగ్రామమందు స్వగృహంలో జరపడానికి నిశ్చ యించారు. వాళ్ళూ పెద్ద మొఖాసాదార్లు. వాళ్ళ కుటుంబం చాలా పెద్దది.

శ్రీ రామారావుగారి స్థితిగతులు కూడా తక్కువవి కావు. అతని తమ్ముడు బి.ఎ. తప్పినా వాళ్ళకు చాలా భూవసతీ, కొద్దిగా నిలవ పైకం ఉన్నవి.

ఆ భూములూ, ఆ ఆస్తూలూ సంరక్షించుకోవటంలోనే అతడు పోయిన పరీక్షకు మళ్ళా కట్టటం కాని, పై చదువులకు పోవటంకాని పడింది కాదుట. శ్రీ రామారావును చూస్తే అతనూ ఒక పెద్ద కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి ఏర్చూరి వారి రెండవ ఆడబడుచు పెద్దకూతురు కూతుర్ని ఇచ్చి పెండ్లి చేశారు. అతను పట్టణంలోనూ, ఇతను పల్లెటూరు లోనూ ఉండటం వల్ల ఆ కుటుంబం రెండింటి ప్రయోజనాలనూ సమానంగా పొందగలదు.

వాళ్ళకు ముగ్గురు అక్కచెల్లెళ్ళు ఉన్నారు. వాళ్ళందరూ ఇంతకుముందే పెండ్లిండ్లు అయి కాపురాలు కూడా చేస్తున్నారు.

ఇంతవరకూ వాళ్ళు చేసినవి అన్నీ పట్నపు సంబంధాలూ, పట్నాలలో ఉండేవాళ్ళ సంబంధాలే. ఇది ఒక్కటే – వారు పల్లెటూరు సంబంధాన్ని వెతికి వెతికి చేస్తున్నారు. కారణం – సూర్యం పల్లెటూరిలో శాశ్వతంగా ఉండవలసిన వాడు కావటం.

ఈ సంబంధం పల్లెటూరి సంబంధమే అయినా సంప్రదాయ సంస్కారాల రెండింటి విషయంలోనూ వీరికేవిధంగానూ తీసిపోదు. కట్నం కానుకల విషయంలో రెండు వేల పదహార్లు కట్నం పెట్టడానికీ, అందుకు తగిన లాంఛనాలు జరపడానికీ సిద్ధపడ్డారు ఆడపెండ్లి వారు.

వివాహపుటేర్పాట్లు కూడా అందుకు తగిన స్థాయిలోనే జరుప బడ్డాయి. మగ పెండ్లివారి తరఫున వచ్చే మగవారు గాని, ఆడంగులు గాని ఇలా తప్పుపట్టడానికి వీలు లేకుండా సమస్తం ఏర్పాటు చేశాడు పెండ్లికూతురు యొక్క రెండవ అన్న.

పెండ్లివారి విడిదికి నూరు నూట యిరవై మంది వచ్చినా స్వేచ్ఛగా సరిపోయే పెద్దయిల్లు ఖాళీ చేయించాడు. వేడినీళ్ళు కాచడానికే ప్రత్యేకం ఒకమనిషి, స్నానానంతరం ఆడవాళ్ళ కట్టువిడుపు బట్టలూ, మగవాళ్ళ కట్టువిడుపు బట్టలూ తడపడానికి ఇంకో ఇద్దరు మనుష్యులు, తలంట్లూ, కాళ్ళు పట్టడాలూ మొదలైన భోగోపచారాల కొరకు మంత్రులను సహితం ఇద్దర్ని ఏర్పాటు చేశారు. వీళ్ళంతా ఆయా పనులకేకాక తక్కిన ఇంకే పనులకైనా ఎవరు ఎప్పుడు పిలిచినా పలకడానికి సిద్ధంగా ఉండాలి. అందుకొరకు వాళ్ళు ఏ పరిస్థితుల్లో కూడా విడిది విడిచి వెళ్ళరాదని గట్టి కట్టడి చేశారు చిన్నబాబు.

శ్రీ రామారావుగారి కుటుంబం అక్కచెల్లెళ్ళూ, ఏ తత్సంబంధీకులూ, తల్లి వంకా తండ్రి వంకా చుట్టాలూ, వాళ్ళ వాళ్ళ పిల్లలూ, ఊరిలో ఇద్దరు ముగ్గురు పెద్దరైతులూ, తక్కిన స్నేహితులూ, నలుగురైదుగురు నౌకర్లూ – అంతా కలిసి దగ్గర దగ్గర నూరు నూట ఇరవై మంది వరకూ ఉంటారు. వీళ్ళంతా 'ఝూం'మంటూ అందుకు తగిన హంగుతో తరలి వచ్చారు.

ఇచ్చి పుచ్చుకోవడాలలో కాని, భోజన బాజునాదులలో కాని అంతవరకూ ఎట్టి ప్రతిబంధకాదులూ సంభవించలేదు. పూటకు దగ్గర దగ్గర నాలుగు వందల వరకూ విస్తళ్ళు తీస్తున్నా సమస్తం సాఫీగానే సాగిపోతున్నది.

మగ పెండ్లివారు పెండ్లికి తరలివచ్చిన సాయంత్రమే తోటలో దిగారు. మరునాడు ఉదయం స్నాతక మహోత్సవం. రాత్రి సరిగా ఎవ్వరికీ నిద్దర్లు లేవు. ఆ తెల్లవారుజామున మూడు గంటల ముప్పది ఐదు నిముషాలకు వివాహ లగ్నం.

**2**

మొఖాసాదారుగారి లోగిలి ఇంటి పెద్దవాకిలి నిండా వేసిన పందిట్లో పదహారు పెట్రోమాక్సు లైట్లు వెలిగిపోతున్నాయి దేదీప్యమానంగా.

పందిరి కింద అంతా మగవారు చుట్టపక్కాలూ, స్నేహితులూ, ఊరి పెద్దలూ, దగ్గర దగ్గర మూడు వందల మంది వరకూ కూర్చొని ఉన్నారు. వాళ్ళ మధ్య వేదికపై వరుణ్ణి కూర్చుండజేసి పురోహితుడు వైవాహిక మంత్రాలను ఉచ్ఛస్వరంలో పఠిస్తూ, మధ్య మధ్య మంగళ వాయిద్యాలతో అతనిచేత రక్షాబంధన చేయిస్తున్నాడు.

ఆడవాళ్ళంతా సువిశాలమైన లోగిలి వరండానిండా కిక్కిరిసి కూర్చుని ఉన్నారు. రంగు రంగుల పట్టుచీరలూ, బంగారపుటాభరణాలు, వాళ్ళ దేహాలపై మెరిసిపోతున్నవి. లోపల దేవుని గదిలో వధువు గౌరీదేవి పూజ చేస్తూ ఉన్నది. కొందరు ముఖ్యులు అనబడేవారు అక్కడకూ ఇక్కడకూ తెగ తిరుగుతున్నారు. సభలో ఉభయపక్షాలకు చెందిన ప్రతినిధులు

వేర్వేరుగా సదస్యులకు చందన తాంబూల సుగంధ ద్రవ్యాదులు సమర్పిస్తూ వాతావరణమల్లా పరిమళమయం చేస్తున్నారు.

ఒక స్థితిలో పురోహితుడు అకస్మాత్తుగా చదువుతున్న మంత్రం ఆపి "ఏరీ? పెళ్లి పెద్దలేరీ? ఎక్కడా కనిపించరేం?" అన్నాడు – శ్రీ రామారావును ఉద్దేశిస్తూ.

దగ్గర్లో ఉన్నవారు శ్రీ రామారావు కోసరం చుట్టూ చూశారు. ఆ చుట్టుపట్ల జనంలో అతడెక్కడా కనిపించలేదు.

ఈ అలజడి విని ఎవరితోనో మాట్లాడుతున్న శ్రీ రామారావు చిన బావమరిది "ఏం కావాలి... డబ్బులేనా? ఇదుగో ఇక్కడ ఉన్నాయి" అంటూ చేతను ఉన్న మనీపర్సు తెరచి పురోహితుడికి కావలసినది తీసి ఇచ్చాడు. ఆయన ఆ డబ్బులు పుచ్చుకుంటూ మర్యాద దెబ్బతిన్నట్టు "డబ్బుల మాటకేం? ఆయనను పిలిపించండి. యింకొక్క పది పదిహేను నిముషాల్లో కన్యాదానం జరగనున్నది. వారు పోయి యెక్కడో కూర్చుంటే ఎలా?" అన్నాడు దీర్ఘాలు తీస్తూ.

కాని అతని మాటలు ఎవరూ పట్టించుకోలేదు. ఆసరికి శ్రీ రామారావు అతని భార్యతో విడిదిలో ఉన్నాడు. విడిది బయట వరండాలో ఇద్దరు దాసీలు మాత్రం అక్కడ కనిపెట్టుక ఉండవలసిన వారు కూర్చుని ఉన్నారు. వాళ్ళు మాట్లాడుతూ, క్షణకాలం మాట్లాడే విషయమేమీ లేక అలా ఇద్దరూ మౌనంగా ఎక్కడెక్కడికో చూస్తూ ఉన్నారు. కిటికీ ఊచలలో నుండి వస్తూన్న పెట్రోమాక్సు లైటు వెలుతురు తప్పిస్తే బయట అంతా చిమ్మ చీకటి. దూరంనుండి మంగళ వాయిద్యాలు ఉండీ ఉడిగీ వినపడుతూ ఉన్నవి. సర్వత్రా జాగరణానుభూతి ప్రస్ఫుటిస్తున్నది.

గదిలో శ్రీదేవి ఒక పెట్టె ముందు వేసుకొని అందులో గల బట్టలన్నీ ఒకటొకటే తీసి ఆత్రుతతో దులుపుతున్నది. అనతి దూరంలో కిటికీ సమీపాన పెట్రోమాక్సు లైటు ఉన్నది. దగ్గరలోనే శ్రీ రామారావు ఒక పెట్టె మీద కూర్చుని భార్య దులుపుతూ వున్న బట్టల వంక చూస్తున్నాడు. అతనిది తెల్లని దేహయష్టి. అది ఎక్కువ లావుగానూ కాకుండా, సన్నం గానూ కాకుండా ఆరోగ్యవంతమైనదిగా వుంటుంది. అతని నుదురు చాలా ఎత్తయినదే కాని విశాలమైనది కాదు. పలుచని పెదవులు ఎల్లవేళలా దగ్గరగా మూసి వుంటాయి. కండ్ల అద్దాల వెనుక కన్నులు తొలి యవ్వనపు తేజస్సును కోల్పోతూ వున్నవి. అతడు కాలేజీకి పోయేటప్పుడల్లా సూట్లే వేస్తాడు. కాని సభలూ మొదలైన సాంఘిక సమావేశాలకు పోయేటప్పుడు ధోవతులు కట్టుకుపోవడానికి ఇష్ట పడతాడు. అప్పుడప్పుడు అటువంటి సమయాలలో వాణీలు వెయ్యటం కూడా కద్దు. ఇప్పుడట్లానే తెల్లని గ్లాస్కో పంచా, సిల్కుకమీజు కండవాలలో వున్నాడు. కాళ్ళకు చెప్పులతో ముడుకులపై మోచేతులను ఆనుకొని భార్య చేస్తున్న పని వంక దృష్టినంతా పెట్టి పరికిస్తున్నాడు.

శ్రీదేవి ఆఖరు చీరకూడా దులిపి అది అట్లానే పెట్టెలో జారవిడిచింది. అంతటితో ఆమె పెట్టెను గాలించడం అప్పటికి మూడవసారి. అంతవరకూ తీసిన ఆ పెట్టెలోని తక్కిన గుడ్డలన్నీ ఆమె చుట్టూ చిన్న చిన్న మేటులుగా పడి వున్నవి, ఆమె వాటి అన్నింటి మధ్య చూడటానికి ఒక బొమ్మలా కూర్చుని ఉన్నది.

శ్రీదేవిలో నాగరిక తరుణులకు వుండవలసిన లక్షణాలు చాలా కనిపిస్తూ వుంటవి. ఆమె పెద్ద అందమయిన మనిషి కాదు కాని కనుముక్కు తీరులో లోపం లేకుండా సామాన్యంగా వుంటుంది. మొహం కోలమొహం. మనిషి కూడా ఏమాత్రమో ఎత్తరి. శరీరం పలుచనే కాక దుర్బలం – కాగా తెల్లగా పాలిపోయి ఉంటుంది. జీవితం పాడయ్యిందనే అక్కసుతో మనసును, శరీరాన్ని పాడుచేసుకొంటున్న లక్షణాలు ఆమెలో లీలగా కానవస్తవి.

కొంతసేపు అటూ యిటూ చూశాక శ్రీదేవి తన దృక్కులను భర్త మొహంలోకి మరల్చి అటు చూసింది. శ్రీరామారావు ఆలోచిస్తున్న వాడల్లా ఆమె చూపుల యొక్క స్పర్శచే ప్రేరితుడై ఆమె వంక తిరిగి ఏదో అడగబోతూ వుంటే పెండ్లి పందిరి నుండి కబురు వచ్చింది.

అతడు వస్తాను పదమంటూనే లేచి ఆ మనిషిని వెళ్ళిపోనిచ్చాక కాస్తసేపు అటూయిటూ తిరిగాడు. తరువాత సరికొత్త ఆలోచనలతో అన్నాడు.

"ఇప్పట్లో మనం చేయగలిగిందల్లా నోరు మూసుకు పడి వుండటమే. తొందరపడి ఎవరినైనా ఏమన్నా అడిగామా సొమ్ము మానాన సొమ్మూ పోతుంది. పైగా నానా యాగీ జరిగి పెళ్ళంతా అభాసై ఊరుకుంటుంది".

ఈ మాటలు ఏ కాస్తో ఉద్రేకంతో అని, కొంచెంసేపు తాళాక మళ్ళా అన్నాడు. ఈసారి అతని గొంతులో తెచ్చికోలు ప్రసన్నత కానవస్తున్నది.

"మళ్ళా ఆలోచించి ఏం చెయ్యవలసిందీ చెప్తాను. అంతవరకూ నువ్వు ఏమీ మాటాడకు" ఇట్లా అని అతడు అక్కడ నుండి వెళ్లిపోయాడు.

శ్రీరామారావు వెళ్లిపోయిన వెనుక శ్రీదేవి కొంతసేపటి వరకూ అతను వెళ్లిపోయిన మార్గం వంకనే చూస్తూ కూర్చున్నది. తరువాత తిరస్కార తీవ్రతచే మలినమైన తన ముఖాన్ని పెట్టెవంక తిప్పుకుంటూ, అంతకంటే తీవ్రతరములైన ఆలోచనాల పరంపరల సంకుల సంక్షోభంతో

మనసు కొట్టుమిట్టాడుకు పోతూ ఉండగా ఆమె బట్టలన్నీ పెట్టెలో సర్దసాగింది. ఆ పని అయిన వెనుక కొంతసేపు పెండ్లి పందిరి దగ్గరకు పోవడమా, మానడమా అని ఆలోచించింది. మానడానికి ధైర్యం చాలక, పోవటానికి ఇష్టంలేక, తిట్టుకుంటూ చివరికొక పావుగంట గడిచాక నెమ్మదిగా బయలుదేరింది.

### 3

శ్రీరామారావుకూ, అంతకంటే శ్రీదేవికీ, ఆ యింటగల స్థానాలు అతి చిత్రములైనవి.

కోడలుగా శ్రీదేవి ఆ ఇంటి కాపురానికి వచ్చి దగ్గర దగ్గర ఆరు సంవత్సరాలు కావస్తూ వున్నది. ఇంతకాలానికీ ఆమె, ఏమాత్రమో అయితే తన భర్తను తప్ప, ఆ ఇంట ఇంకొక వ్యక్తినైనా సరే తనకు సన్నిహిత బంధువుగా చేసుకోలేక పోయింది.

ఇందుకు ఆమె ఎంతవరకూ బాధ్యురాలో ఆ ఇంటగల తక్కిన అందరూ కూడా అంతమేరకూ బాధ్యులేననాలి. కానీ చూసే వారందరికీ శ్రీదేవి తప్పే ఎక్కువలా కానవస్తూ వుంటుంది.

ఇందుకు కారణమేమని వితర్కిస్తే ఆ ఇంటివారు 'ఆమె గుణాలు' అంటూ శ్రీదేవి గుణాలను వేనినో ఎత్తి చూపుతారు. తాను నాగరికురాలు కావడం వల్లా, స్కూలు ఫైనల్ వరకూ చదివి వుండడం వల్లా 'ఆ పల్లెటూరి మూకకు పనికి వచ్చాను కాను' అంటుంది శ్రీదేవి. ఉభయ పక్షాల వారికీ సామాన్య బంధువైన శ్రీరామారావును ప్రశ్నించ గలుగుతే అతడు దీనికి కారణం ఇదమిద్ధమని తేల్చి చెప్పడం కష్టమంటాడు. తన భార్యయొక్క చదువు ఆమెదైన ఆడతనాన్ని మార్చగలిగి వుంటే ఇన్నిచిక్కులు వచ్చి వుండేవి కావని ఆ భావుకుని అభిప్రాయం. ఇది తెలుసుకుని అతని బావమరిది – అంటే శ్రీదేవి అన్న– అతని గురించి "శ్రీరామారావుకు ఎదిరి లోపమే గాని తన లోపం గాని తనవారి లోపం గాని చూడగలిగే శక్తి చాల"దంటాడు.

వైవిధ్యంతో పాటు ఏకత్వాన్ని సహితం స్ఫురింపజేసే ఈ వాదనలన్నీ వింటే వాళ్లందరూ చూసినదీ ఒక్క ఏనుగేనని తెలిసిపోతుంది. అసలు మూల కారణం శ్రీదేవి పుట్టిన కుటుంబం, ఆమె మెట్టిన కుటుంబం నుండి అత్యంత విభిన్నం కావటంలో వున్నది.

శ్రీదేవి కుటుంబం తన అత్తవారి కుటుంబంలా మధ్య తరగతి పల్లెటూరి భూస్వామ్య కుటుంబం కాదు. ఆమె నాగరికమైన ఒక "గొప్ప కుటుంబాని"కి అనుబంధంగా ఉండే వేరొక ''చిన్న గొప్ప ఇంటి'' బిడ్డ. ఆమె తల్లి మేనమామలందరూ – ఆమె మేనమామలు కూడా – దేశ మందంతటా పెద్ద పెద్ద మహానగరాలలో ఉన్నతమైన పదవులను ఆక్రమించి వున్నవారు. ఆమె అన్నదమ్ములు కూడా ఢిల్లీ సెక్రటేరియట్‌లో ఒకరూ, మద్రాసు సెక్రటేరియట్‌లో ఒకరూ – ఆ నడుమనే ఉద్యోగాలు సంపాయించి ఉన్నారు. వాళ్ళు ఇద్దరూ జీవితంలో పెద్ద పెద్ద ఆశలు పెట్టుకొని వాటి విజయానికై తమ శక్తివంచన లేకుండా సర్వవిధాలా కృషిచేస్తూ వున్నారు. ఏనాటికైనా తాము కూడా తల్లి వంక చుట్టాలంతటి వాళ్ళు కావాలని వాళ్ళకూ వాళ్ళ తల్లికీ కూడా ఒక గట్టి పట్టుదల.

కాని శ్రీదేవి తండ్రి మాత్రం ఈ వర్గానికి చెందిన మనిషి కాడు. ఆయన "లా" చదివి పట్టణంలో ప్రాక్టీసు పెట్టి నాగరికుడుగా చలామణీ అవుతున్నా, పుట్టుకచేతా, వస్తుతః కూడా పల్లెటూరివాడే. అందుచేతనే ఆయన తన కూతుళ్ళకు ఇద్దరికీ వివాహాలు చేయవలసి వచ్చేసరికి సహజంగా పల్లెటూరి వాళ్ళనే వెదికి చేస్తూ వచ్చారు. సహజమైన ఈ సంఘటన నుండి శ్రీదేవి తల్లి తన యొక్క కల్పనా చమత్కృతి అంతా ఏర్పడేటట్టు చక్కని కథనొకదానిని అల్లి అందరికీ చెపుతూ వుంటుంది. ఏర్పూరివారి (శ్రీదేవి తల్లుల తల్లుల వరుసలనుబట్టి ముత్తాతలు) వంశాగతలైన ఆడపడుచులకు ఈ రెండు మూడు తరాలనుండీ కూడా పల్లెటూళ్ళ నుండి వచ్చి పట్టణాలలో స్థిరపడనున్న భర్తలే దొరుకుతున్నారట గాని పుట్టుకతోనే పట్టణవాసులైన భర్తలు దొరకటం లేదట. ఆమె మాటలలోనే చెప్పవలసి వస్తే అది మాతామహుడు ఆ ఇంటి ఆడపడుచులకు తెచ్చిపెట్టిన 'శాపం'. శ్రీదేవి తల్లితండ్రిది కూడా శ్రీదేవి తండ్రిదిలానే పల్లెటూరి పుట్టుకా, పట్టణం కాపురం. అందుచేతనే వాళ్ళు ఎన్నియేళ్ళు గడిచినా ఆ వాసనలు విడువలేక కూతుళ్ళను మళ్ళా మళ్ళా తమబోటి పల్లెటూరి వారికే వెతికి ఇస్తూ ఉంటారట.

ఈ విచిత్ర వ్యాఖ్యలో యదార్థత వివరించటం ఎంత ఉన్నదో దానిని మభ్యపుచ్చటం కూడా అంత ఉన్నది.

నిజానికి శ్రీదేవి తల్లి అంగీకారం లేనిదే ఈ పెళ్ళిళ్ళు రెండూ జరిగి ఉండలేదు. కాని ఆమె ఆ విషయాన్ని అట్లా బాహాటంగా అంగీకరించ టానికి ఎంతమాత్రం ఇష్టపడదు.

శ్రీదేవి తల్లిలో ఆమెకే తెలియని ఒకానొక విచిత్ర ప్రవృత్తి – ఆమె నాగరికతకు సంబంధించినది రహస్యంగా దాగి ఉన్నది. దాని స్వరూప స్వభావాదులామెకు విస్పష్టంగా తెలియకపోయినా దాని ప్రేరణతోనే ఆమె అనేక విషయాలలో తనకాయుష్కరమేదో, తన అభివృద్ధికేది దోహదకారి కాగలదో అతి సులభంగా తెలుసుకుంటూ ఉంటుంది.

అట్లా తెలుసుకునే ఆమె – తన భర్త, తమకున్నవీ చెందినవీ అయిన అభివృద్ధి మార్గాలనన్నింటినీ పుత్రుల కోసరమే మీదు గట్టినట్టు, కూతుళ్ళకు వారు కోరగల వివాహాలు కాకుండా నచ్చగల వివాహాలు చేస్తూ ఉంటే తాను మాటాడక ఉదాసీనత వహించి ఊరుకున్నది. కాక – అనేక విషయాలలో తన అభిమతానికి పరిస్థితులు విరుద్ధంగా ఉన్నట్టు తోస్తే వాటితో పోట్లాడి ఎల్లానో నిగ్రహించుకుంటూ వచ్చిన ఆడది ఇప్పుడిట్లా భర్తృ నిర్ణయానికి అకస్మాత్తుగా కట్టుపడి పోయిందంటే అర్థం లేదని చెప్పాలిసి ఉంటుంది.

ఈ విషయం మొదట్లో కాకపోయినా తరువాత తరువాత ఆమె కూతుళ్ళు కూడా నెమ్మదిగా గ్రహించసాగారు. వాళ్ళకు ఏళ్ళు పైబడుతున్న కొద్దీ – లోకాన్ని చూచిన కొద్దీ– తల్లిలోగల – పరిస్థితులను మార్చుకోగల చాకచక్యం – పట్టుబడకపోయినా తమ మంచికేది అవసరమో – ఏది కాదో గ్రహించగల శక్తి వృద్ధి పొందుతూ ఉన్నది.

"మంచి" అనేది మనుష్యకోటి కంతటికీ ఒక్కటే కాదనీ మనుష్యుల స్వభావ సంస్కారాదులనుబట్టి అది మారుతూ ఉంటుందనీ గ్రహించ గలుగుతే శ్రీదేవి అసంతృప్తికి కారణం ఏమన్న ప్రశ్న కలుగదు. పెండ్లి నాటికి కాలేజీ లెక్చరర్లంటే ఉండే అభిప్రాయం పెండ్లయిన తరువాత లోకంచూశాక, అంతకన్నా నలుగురి మాటలూ నాలుగు రకాల విన్నాక, చాలా మారిపోయింది. తనకు లభించినదేదో తాను కోరగలది కాదని తెలుసుకున్నది లగాయితూ శ్రీదేవిలో ఒక విధమయిన ఆక్రోశం పెరగ సాగింది. ఆ ఆక్రోశాన్ని బహిర్గతం చేసుకోవడంలో, ఆమె తనలో అంతకు ముందు లేనివి కూడా అనేక దుర్గుణాలు ఒక్కొక్కటీ అలవాటు చేసుకొని, వానినన్నింటినీ ప్రదర్శిస్తూ ఆ ఇంటి అందరికీ ఆవిధంగా చెడ్డదయి కూర్చున్నది.

## 4

శ్రీదేవినిలానే శ్రీరామారావును కూడా ఆ ఇంట అందరూ పరాయి వాణ్నిగానే చూస్తారు.

దానికి హేతువు కూడా శ్రీదేవి రాకలా కనిపించినా అసలు కారణాలు చాలా వరకూ వేరుగానే ఉన్నవి. వానిలో కొన్నింటి బీజాలు శ్రీదేవి భూదేవిపై పడక ముందునుంచీ ఆ కుటుంబంలో పడ్డాయన్నా వింతకాదు.

శ్రీదేవి అత్తవారియింట పాదం పెట్టిన ఆ యేడాదే శ్రీరామారావు తండ్రిగారు కాలంచేశారు. ఆయన పోయేసరికి – వారివి కొన్ని భూముల వ్యవహారాలు, మరికొన్ని నగదు వ్యవహారాలు, అపరిష్కృతములుగా వుండి పరిష్కారోన్ముఖమైనవి ఉండెను. వానిని చక్కబెట్టడాని కైతేనేం తక్కిన వ్యవసాయం మొదలైన యింటి పనులు చూడడానికైతేనేం మొగపిల్ల లిద్దర్లో అక్కడ ఎవరు ఉంటారనే ప్రశ్న సహజంగా ఉద్భవిల్లింది. కొత్తగా ఉద్యోగంలో ప్రవేశించిన శ్రీరామారావు తండ్రి శ్రాద్ధకర్మలకు శలవు దొరకడమే బ్రహ్మాండ మవుతోందనగా, అతడు రాకపోవడమే మంచిదిగా తలుస్తూ అప్పటికి బి.ఎ. సెప్టెంబరు పరీక్షలకు ట్యుటోరియల్ కాలేజీలో చదువుతున్న సూర్యాన్నే చదువు మానిపించి ఇంటివద్ద పెట్టింది – వెంకట నర్సమ్మగారు.

సూర్యానికీ శ్రీరామారావుకూ అనేక విషయాలలో తేడా ఉన్నదన్న సంగతి ఆదినుండీ కూడా ఆ యింట ఒకవిధంగా గుర్తింపబడే ఉండెను. ఆ ఇంటికి సంబంధించిన వ్యవహారాలూ, లావాదేవీలూ అయితేనేం, లోకంలో మసలుకోవలసిన పద్ధతీ చూపవలసిన వైఖరీ అయితేనేం, సూర్యానికి తెలిసినంత చక్కగా శ్రీరామారావుకు తెలియదని, అందరిలోనూ ఒక గాఢమైన విశ్వాసాన్ని శ్రీరామారావు తండ్రిగారే ఏర్పరచి పోయారు. దానికితోడు శ్రీదేవి రాక కూడా కొంత తోడుకాగా ఇల్లు నిర్వహించడానికి సూర్యం రావడమే మంచిదని ఏకగ్రీవంగా అందరూ తీర్మానించారు. సూర్యం గూడా తనకు లభించిన గౌరవాన్ని దక్కించుకుంటూ అందుకు తగిన విధంగానే అన్ని విషయాలలోనూ చాలా జాగ్రత్తగా ప్రవర్తిస్తూ వచ్చాడు.

చిన్నకొడుకు ఇంటికి వచ్చిన వెనుక ఆ తల్లికీ అతడికీ ఉంటూ వచ్చిన సాన్నిహిత్యం ఇతోధికంగా ఎక్కువ అయ్యింది. ఆ కొడుకు ప్రతి విషయం లోనూ తన సలహా తీసుకుంటూ సర్వం చక్కదిద్దుక వస్తూ వుంటే ఆమెకు సహజంగా అతనిపై ఒక విధమైన సానుభూతీ ఆపేక్షా కొత్తగా పుట్టి వృద్ధి కాసాగాయి. ఆ వెలుతుర్లో చూస్తే ఆమె తన ఇద్దరు కొడుకులను గురించీ పెట్టుక వస్తున్న భావాలన్నీ నిజంగా తోచడమే కాకుండా పెద్దకొడుకు మొదటనుండీ కూడా ఒట్టి స్వార్థపరుడుగానూ డబ్బు కోసరం తప్ప ఇంక ఎందుకూ ఆ యింటి వంక చూడనివాడుగానూ కనిపించసాగాడు.

అప్పట్లో పట్టణాలలో ఉంటూ చదువుకోవడంలో తాను ఒక్కడూ ఉండేటప్పుడు, తమ్ముడు వెంట నుండినప్పుడూ కూడా శ్రీరామారావే డబ్బు కోసరం ఇంటికి ఉత్తరాలు రాసేవాడు. చదువుకునే కొడుకులు శలవు దినాలలో ఇళ్ళ వద్ద అతి తక్కువగా గడిపే దినాల ముద్రలకన్నా వాళ్ళు దూరంగా ఉండినప్పుడు వాళ్ళ కోసరం ఎదురు చూచినప్పటి అనుభూతుల ముద్రలే – వాళ్ళు రాసిన ఉత్తరాల ముద్రలే – తల్లి దండ్రుల హృదయాలపై ఎక్కుడు బలంగా ఉండిపోతవి. ఆ దృష్ట్యా అప్పట్లో క్షేమ సమాచారాలు రాయటానికి

బద్దకించిన శ్రీరామారావు యిప్పుడిట్లా కనిపించసాగాడు.

అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమంటే ఆరోజుల్లో శ్రీరామారావు పై తండ్రి ఈ ఆరోపణను చేయగా వెంకట నర్సమ్మగారు అతడి పక్షం 'వకాల్తా పుచ్చుకొని' వాదించేవారు. బహుశా అందునుంచేనేమో ఇప్పుడిట్లా తానుగా ఆరోపణ చేస్తూ దానిని తానే బలపరచుక వస్తున్నది ఆమె.

ఆ తల్లి అట్టి భావనలను పెంచుకోవడానికి దోహదంగా శ్రీరామా రావులో ఇంకొక పెద్ద లోపం కూడా ఉన్నది. అతడు తనకు కావలసిన వారి యెడల కాని – కనీసం ఆప్తుల ఎడనైనా ఎన్నడూ ఏవిధమైన ఆపేక్షలూ వెళ్ళబుచ్చే స్వభావానికి చెందిన మనిషి కాదు. ఆరేళ్ళయి ఉద్యోగం చేస్తున్నాడన్న మాటేగాని ఇంతవరకూ ఒక్కసారి అయినా తన ఇంటికి పిలిచి ఒక ఆడపడుచుకుగాని, తల్లికిగాని ఒక్క గుడ్డముక్కయినా ఇచ్చిన పాపాన పోలేదు. ఎక్కడకు పోయినా ఒట్టి చేతులతోనే పోయి ఒక పూటో ఒకరోజో కన్న ఎక్కువ వుండటానికి పెద్ద బ్రహ్మాండం పగుల జేస్తాడు. కోరి తన ఇంటికి వచ్చిన వారి విషయంలో కూడా అతడు ఇట్లాంటి ఉదాసీన పద్ధతే అవలంభించి అందరికీ కోపం తెప్పిస్తూ ఉంటాడు. అదంతా అపేక్షలు లేకా, వెళ్ళబుచ్చటం తెలియకా అయితే అది వేరే సంగతిగా ఉండేది. శ్రీరామారావు తన సంస్కారం దృష్ట్యా ఇట్లాంటి వ్యవహారమంతా చాలా కృత్రిమమేకాక శుద్ధ నటన అని కూడా అనుకుంటాడు. ఆనీ పుస్తకస్థములైన అతని నవ సంస్కారపు విలువల ఔన్నత్యం వానిని చదువని అతని తల్లికిగాని, అక్కచెల్లెళ్ళకు గాని తెలియటం అసంభవమని అతడు గ్రహించి ఉండవలసింది.

అట్లానే సూర్యం కూడా ఇంటికి వచ్చాన తన అన్నగారి గురించి కొన్ని చిత్రములైన అభిప్రాయాలు ఏర్పరచుకోసాగాడు. ఊరి వారి దృష్టిలో శ్రీరామారావు అతి సజ్జనుడే కాక అమాయకుడు కాగా – సూర్యం చండ శాసనత్వానికి తోడు మంచి గడుస్తనం కలవాడు. వాళ్ళనేవారు, చిన్నబ్బాయి గారు మాటలు కాడికి మంచి వారైనా డబ్బు దగ్గరకు వచ్చేసరికి నిక్కచ్చి మనిషై కూకుంటారు. నందిని పందినీ, పందిని నందినీ చేయగల సామర్థ్యం ఈయనదైతే యింక ఆయనా, ఆయన దంతా మాయా మర్మంలేని మారాజు మనసు.

ఇచ్చకానికైతేనేం, నిజంగానైతేనేం, లేక పరిస్థితులు కలిగించిన భ్రమచే లోకులు మోహితులవడం వల్లనైతేనేం, ఆ అన్నదమ్ములను గూర్చి వాళ్ళంతా యిట్లా అనుకోవడం వల్ల ఆ కుటుంబపు వ్యవహారాల చక్కబాటు విషయంలో అది చాలా మంచిగా పనిచేసినా మనస్తత్వాల దగ్గరకు వచ్చేసరికి మాత్రం మహావిషంగా పనిచేయసాగింది. సూర్యం యువక హృదయంలో అన్నగారిపై ఏ విధానం అణచుకోవటానికి సాధ్యపడని యీర్ష్య ఒకటి కొత్తగా మొలకలెత్తి క్రమక్రమంగా అభివృద్ధి కాసాగింది.

ఆ ఈర్ష్య ప్రభావం వల్ల అతనికి శ్రీరామారావు ఒక మేకవన్నె పులిగానూ, అతి కుచ్చితుడుగానూ కనిపించే వాడు. తన స్థానాన్ని తాను పదిలపరచుకుంటూ పైగా నంగనాచిలా సూర్యాన్ని మధ్యలో చదువు మానిపించి ఆ పల్లెటూరిలో ఉమ్మడి ఆస్తుల రక్షణకు పెట్టి కష్టనిష్టూరాలు అతడివి కాగా ఫలితం మాత్రం తాను పంచుకుంటూ – కోతీ పిల్లీ, జీడిపిక్కల కథలో పిల్లిని కోతిలా తనను ఉపయోగించుకుంటున్నాడు అనిపించేది సూర్యానికి.

ఇట్లా ఆ తల్లీ కొడుకులలో, అతి సహజంగా, అందులో వాళ్ళ ప్రయత్నమేమీ లేకుండానే, అత్యంత అసహజమైన విద్వేష భావాలు, ఆ ప్రవాసి శ్రీరామారావుపై కలుగుతూ వచ్చినవి. వాటిని చాలాకాలం వరకూ వారిద్దరూ ఎవరిమట్టుకు వారుగా లోలోన దాచుకుంటూ వచ్చినా ఒకనాటి కవి వ్రణములలో నుండి పూయములవలె బయటకు రాక తప్పాయి కావు.

వెంకటనర్సమ్మ గారు అంతో ఇంతో కోపిష్ఠీ, పెద్ద గొంతుక పెట్టి అరచి సాధించే రకం ఐతే అవవచ్చు కాని వస్తుతః పట్టి భోళా మనిషి. ఆమెలోని పెద్దకొడుకు – తల్లి, మొదట్లో అల్లా ఉదారంగానో, బలహీనత చేతో, దీనినంతా సహించుతూ ఊరుకున్నా, ఒక స్థితిలో వెంకటనర్సమ్మ గారొక అంతిమ నిర్ణయానికి వచ్చేసరికి, తిరగబడి ఇదంతా అన్యాయమంటూ ఆమె అంతరంగాన్నంతా కలచివేసే ధోరణిలో – 'వీధినిబెట్టి' నానా హంగామా చేయసాగింది. అందుచేతనే ఆమె తనలో తాను పోట్లాడుకొంటూ అందరినీ తీర్పు చెప్పడానికి పిలిచినట్టు పోగుచేసి వాళ్ల ముందు తన అభిప్రాయాలను సోదాహరణంగా వినిపించడం ఆరంభించింది.

ఆదిలో ఆమె శ్రీదేవిని సాకుగా చేసుకొని శ్రీరామారావును నిందిస్తూ వచ్చినా, క్రమంగా ఆమె సూటిగా గూడా అతని స్వభావాన్నీ, మతాన్నీ విమర్శించటం ఆరంభించింది. సూర్యం ఈ చర్చలన్నింటిలో శ్రీరామా రావును సమర్థిస్తున్నట్టు కనబడుతూనే అతనిలోని లోపాలను అందరికీ వివరంగా ఎత్తి చూపేవాడు. క్రమంగా ఈ భావనల బీజాలు ఆ బంధువర్గంలో ఒకరి నుండి ఒకరికీ – వారినుండి వేరొకరికీగా ఆ వర్గంలో అందరిలోనూ వ్యాపిస్తూ అనేక విధములైన పాఠాంతరాలు చెందుతూ వచ్చినవి. అట్టి వానిలో

కొన్నింటిని శ్రీరామారావు వినటం కూడా తటస్థించినది.

అతడు వీటి అంతరార్థాన్ని గురించి ఊహించడానికి ప్రయత్నం చేస్తూ ఒక్కొక్కసారి దీనికంతటకూ కారణం శ్రీదేవి తోటి వివాహం అనుకుంటాడు. వేరొకసారి తన వారి అజ్ఞానంతో పాటు తనయొక్క దురదృష్టమే తమకు చెందిన సర్వవిధములైన అనర్థములకూ మూలకారణాలు అనుకుంటాడు.

## 5

పరిస్థితులు ఇట్లాంటివి కాబట్టే శ్రీరామారావు గొలుసు పోయిన విషయం నలుగురు ముందూ పెట్టడానికి ఎంతగానో వితర్కించవలసి వచ్చింది.

ఇంతవరకూ తమ కుటుంబంలో ఆ అత్తాకోడళ్ళ నడుమగాని, తన మధ్యా తక్కినవారి మధ్యనూ గాని, ఎన్నడూ ఏ అప్రియ సంఘటనా ప్రత్యక్షంగా జరిగి ఉండని మాట నిజమే. కాని, ఇంతమంది బంధువర్గం వారు చుట్టూ ఉండటం వల్ల ఏ పరిస్థితులు ఎట్టా వచ్చి ఆ గోడుకాస్తా చెడగొడతాయోనని శ్రీరామారావు చాలా భయపడసాగాడు.

అతడా ఉదయమల్లా ఈ విషయంపై అతిదీర్ఘంగా ఆలోచిస్తూనే వున్నాడు. పందిట్లోనూ, విడిదిలోనూ మనిషి మసలుతూనే ఉన్నా మనసల్లా దానిమీద పెట్టి ఏ ఇతర విషయమూ లోనికి పట్టించుకోవడం లేదు.

అతడికి ఏం తెలిసినా, ఏం తెలియకపోయినా, ఒక్క విషయం మాత్రం బాగా తెలుసు. వేయి రూపాయలంటే – అది తనకైనంత తక్కువ మొత్తంగా ఆ యింటిలో ఇంక యెవ్వరికీ కాదు. తన తల్లిగానీ, తమ్ముడు గానీ ఈ విషయం వింటే వాళ్ళు తనలా నిదానిస్తారనే ధైర్యం అతడికే విధంగా చూసినా కలగటం లేదు. అసలే కోతివంటి శ్రీదేవికి తేలుకుట్టి ఉన్నదనే సంగతి గుర్తించక వాళ్ళు వాత కూడా పెట్టి రెచ్చగొట్టవచ్చును. దానిమీద ఎలాంటి సన్నివేశాలు ప్రభవించడానికి అవకాశమున్నదో ఆ విషయం శ్రీరామారావు కూడా చెప్పలేడు.

ఒకవేళ వారు ఊరుకున్నా చుట్టూ వున్న మహాజనమండలి వారిని ఊరుకోనిస్తుందనే నమ్మకం ఏమాత్రం కూడా అతడికి కలగడం లేదు. అంతమంది బంధువుల నడుమ ఎవరు ఏ నిప్పుకణం వంటి ఒక భావాన్ని ఎక్కడ విదల్చి ఏ మహాగ్నులను రగులజేస్తారో చెప్పటం కష్టం. దానితో అనుమానాలూ, అయి వుండటాలూ, అపప్రథలూ, ఆరోపణలూ, అసత్యాలూ, సత్యాలూ, ఋజువులూ, ప్రామాణికాలూ, పెట్టెలు తెరిపించి చూడడాలూ, ఏడుపులూ, మొఱ్ఱలూ, పోలీస్‌రిపోర్టులూ, మురిగి కంపు గొట్టే ఎవ్వరెవ్వరి పాతకథలూ, అలిగిపోవడాలూ, బ్రతిమిలాడటాలూ, అభోజనాలూ, ఒకటేమిటి ఏం జరిగినా ఎంత జరిగినా జరగడానికి అవకాశం ఉండినట్టే కనిపించింది. కొన్నికొన్ని చోట్ల ఇలాంటి సందర్భాల లోనే మనుష్యులు జన్మాలకు సరిపడే వైరాలను సృష్టించుకొని వాటిని ఆజన్మాంతం పరిపోషించుకొంటూ కూర్చోవడం కూడా కద్దని శ్రీరామారావు బాగా ఎరుగును.

కాగా అతడికి ఇంకొక ఆశ కూడా లేకపోలేదు.

శ్రీదేవి ఆ నగను అక్కడా ఇక్కడా అజాగ్రత్తగా పారవేసినదేమీ లేదు. గతరాత్రి తొమ్మిది గంటల వరకు నగ ఆమె మెడలోనే వుండెను. అప్పుడు బట్టలు మార్చుకుంటూ ఆమె దానిని తీసి పెట్టెలో చీర మడతల నడుమ ఉంచింది. ఆమెకు సాధారణంగా ఆభరణాలను ఒక ప్లాస్టిక్ పెట్టెలో పెట్టి ఉంచడమే అలవాటు. అయినా దానిని ఈ పెండ్లికి తెస్తే వల్లెటూరి మూకలో ఏ వేనగోడలైనా అడిగిపోతుందేమోనని ఆమె భయపడ్డది.

అట్లా దాచిన ఆ వస్తువును ఎవరో దొంగిలించి ఉంటారనడానికి ఏవిధమయిన అవకాశం కానరాదు. పెట్టెకు వేసిన కప్పు వేసినట్టే ఉన్నది. అది చాలా గట్టిది. శ్రీదేవి ఏ నెపాన దాని తాళం ఇతరుల చేతికి ఈయలేదు. శ్రీరామారావు దగ్గర డూప్లికేట్ ఉన్నా దానిని అతడు కూడా ఎవ్వరికీ ఇవ్వలేదు. పోనీ తాళాలే తస్కరించి ఎవ్వరో ఈ పనిచేసి ఉంటారనుకుంటే ఆ అవకాశం ఉండినట్టు కానరాదు. శ్రీదేవి తాళం పైట చెరగు క్రింద ఒక పిన్నుతో రవికెకు తగిలింపబడి ఉంటుంది. శ్రీరామారావు దగ్గర తాళం పర్సులో ఉంచబడి అతని పెట్టెలో ఉండగా, ఆ పెట్టె తాళం మళ్ళా శ్రీదేవి తాళంతో జోడింపబడి వుంటుంది.

ఎటువచ్చీ నగపోయిన విధం ఊహించడానికి రెండే రెండు మార్గాలు ఉన్నాయి. శ్రీదేవి బట్టలు సర్దుతున్నప్పుడు అక్కడ దగ్గరలో చేరిగాని లేక ఆ తరువాత ఆమె మళ్ళా దేనికొరకో పెట్టె తెరచి వెతికినప్పుడు బట్టలు కిందా మీదా పెట్టడంలో పైన జారిపోతే గాని – ఎవరో దానిని సంగ్రహించి ఉండాలి. కాని శ్రీదేవి తాను పెట్టె రెండుసార్లు తెరచినప్పుడూ దగ్గరలో ఎవ్వరూ ఉండిన జ్ఞాపకం లేదంటుంది. కాబట్టి నిశ్చయంగా అనగా రెండవ పద్ధతినే పోయి వుండాలి.

ఇంక–

అట్లాంటి వారెవ్వరో – వారు వస్తువును దాచేసుకొనే ఉద్దేశంతో ఉంటే తమ జాగ్రత్తలో తాము ఉండనే ఉంటారు. అమాయకులై ఉండి అట్లా జాగ్రత్తపడకపోతే పైన పేర్కొనబడ్డ రభసల్లో ఏదో ఒక రభస తప్పక ఏర్పడి అత్యంత అవాంఛనీయములైన పరిస్థితుల్లో అంతా అసహ్యంగా తయారు కావచ్చును.

లేక అదృష్టమే బాగావుండి, శ్రీరామారావు తొంబది తొమ్మిది వంతులుగా నమ్ముతున్నట్టు అది ఎవ్వరికో తమ వారికే దొరికితే వాళ్ళు ఒక పూటో రెండుపూటలో మాటాడక ఊరుకొని తరువాత చీవాట్లు పెట్టో పెట్టకో మొత్తానికి వస్తువును తిరిగి ఇచ్చివేస్తారు.

ఇట్లా ఆలోచించే శ్రీరామారావు ఏది ఏమైనా చివరకు వస్తువు పోయినా సరే పోనిమ్మని ఆ విషయం నలుగురి ముందూ పెట్టకుండా ఉండటానికే నిశ్చయించాడు. కాని శ్రీదేవి చిత్తవృత్తి వేరుగా ఉండెను.

ఆమె – భర్త ఏ పరిస్థితులకైతే వెరచి వేయి రూపాయిల నగనూ విడుచుకోవడానికి సిద్ధపడ్డారో ఆ పరిస్థితులనే అవసరమైతే తానుగా సృష్టించి ఎందరడ్డుపడ్డా అందరితోనూ పోరాడి అయినా తన వస్తువును తాను రాబట్టుకోవడానికే నిశ్చయించుకున్నది. ఆమె ఊహల ప్రకారం నగను ఎవ్వరో దొంగిలించి ఉంటారనటమే తథ్యం. అది ఎవరైనా తీసి జాగ్రత్త చేసి ఉండవచ్చనే ఊహ ఆమెకు కలగలేదు సరికదా శ్రీరామారావు దానిని సూచించిన వెనుకైనా అది ఒక అసంబద్ధపు పిచ్చి ఊహగానే నమ్మింది. అందుచేతనే ఆమె నగపోయిన విషయం ఎవరితోనూ చెప్పవద్దని శ్రీరామారావు చెప్పినప్పుడు ఎటూ చెప్పకుండా మాటాడక గుంభనంగా ఊరుకొన్నది. తరువాత మాత్రం తన ఊహలూ, ప్రయత్నాలూ ఎప్పటిలా సాగించుకొని పోతూ తన పద్ధతి తాను విడిచి పుచ్చలేదు.

ఆమె ఆ పెండ్లి ఇంటగల మూడు నాలుగు వందల మందినీ వాళ్ళ వాళ్ళ ముఖ కవళికలను బట్టీ, చేష్టలను బట్టీ, తనకు తెలిసిన మేరకు తన ఊహకందిన మేరకు వాళ్ళ వాళ్ళచరిత్రలూ, స్వభావాలనూ బట్టీ ఎవరు తీసి ఉంటారా అని చాలా జాగ్రత్తగా ఆలోచించింది. చివరకు ఆమె పెద్దాడబడుచు – శ్రీరామారావు పెద్ద చెల్లెలు విశాలాక్షిపై తన అనుమానాల నన్నింటినీ క్షణక్షణంకూ కేంద్రీకరించుకోసాగింది.

## 6

విశాలాక్షి శ్రీరామారావు తల్లిగన్న సంతానం ఐదుగురిలోనూ రెండవ బిడ్డ. శ్రీరామారావు ఆమెకన్న పెద్దవాడు కాగా తక్కిన ఆడపిల్లలిద్దరూ, సూర్యం ఆమెకు తరువాతి వారు. సూర్యం ఆ ఆడపిల్లలిద్దరి లోనూ మధ్య వాడు. విశాలాక్షిని గూర్చి లోకంలో ఎన్నో చిత్ర విచిత్రములైన కథలు ఉన్నవి.

లోకులు ఆమె భర్త మహావ్యసని అనీ, ముందూ వెనుకా చూసుకోకుండా చిన్నప్పుడే పెండ్లి చేసి ఆమె తండ్రి కూతురు గొంతును చేజేతుల కోసి పెట్టుకున్నాడనీ ఇంకా ఏమేమో చాలా అంటారు. శ్రీరామారావు తండ్రి పాతికేండ్ల క్రితం శారదా బిల్లు హడావుడిలో అప్పటికి బతికి ఉన్న ఆయన తల్లిగారి పోరు పడలేక నైతేనేం, తనకు కూడా అంతో ఇంతో ఒక కార్యం చేసి చూడాలనే ఉత్సాహం కలగడం వల్లనైతేనేం అప్పటికి ఐదారేండ్ల వయసుగల ఆ పిల్లను, వేలు విడిచిన మేనల్లునకొకనికిచ్చి, పెండ్లి చేసిన మాట నిజం. అప్పట్లో విశాలాక్షి భర్తది సుమారు లక్ష రూపాయల పైచిలుకు ఆస్తి చరస్థిర రూపేణ ఉండగా పిల్లవాడు తండ్రికి ఒక్కడే ఒక మగ బిడ్డగా ఉండెను. అంతకు ముందూ దరిమిలాను పుట్టిన అతని తోడబుట్టువులు అందరూ ఆడపిల్లలు – వాళ్ళయినా పుట్టగానే కొందరూ, అంతో ఇంతో పెరిగి కొందరూగా మొత్తానికి అందరూ అర్థాయుష్కులే అనిపించుకున్నారు. ఇట్లా పిల్లవాడు ఆస్తికంతటికీ ఏకైక వారసుడు కావడమే కాకుండా పట్నంలో చదువు కూడా వెలగబెడుతూ ఉండెను. వివాహం నాటికి ఆ సంబంధంలో గల ఒకే ఒక లోపం పిల్లవాడు విశాలాక్షి సౌందర్యానికి తగినంతటి చక్కని వాడు కాకపోవడం. కాలగతిలో ఈ అసలు లోపం ఎవరికో తప్ప ఒక పెద్ద లోపంగా కనిపించడమే మానివేసినా కొన్ని కొత్త లోపాలు ఎవ్వరూ ఊహించి ఉండనివి విశాలాక్షి భర్తలో పొడసూపి వాటి పుట్టుకకు ఏ విధానా బాధ్యులు కాని ఆ ముసలాయన చరిత్రపై నిష్కారణంగా నిందలు మోపి విడిచి పెట్టినవి.

విశాలాక్షికి పండ్రెండేండ్ల వయసులో ఆమె మామగారు ఎవ్వరూ ఊహించని విధంగా పక్షవాతంతో కొద్ది దినాలు తీసుకొని బ్రతుకుతాడని ఆశ కలిగిస్తూనే బ్రతక్కుండా పోయారు. ఆసరికి నరసింగరావు ఆ నడుమనే చదువు మానుకొన్న, నిండా ఇరవై సంవత్సరాలైనా దాటని, ఒక ధనవంతుల ఇంట దక్కక దక్కక దక్కిన ఒక్కగాని ఒక్క మొగపిల్లవాడు. తండ్రి బ్రతికి ఉండగా ఆ పిల్లవానికి లోకజ్ఞానం సంపాదించే అవకాశం ఏ మాత్రం కూడా లేకపోగా ఆయన పోయాక అతడు దానిని సంపాదించే ప్రయత్నం నెమ్మదిగా ప్రారంభించాడు. ఆ ప్రయత్నంలో ఆస్తి అంతా హరించుకుపోగా చివరికొక నాటికి మనిషి మాత్రమే ఎట్లానో మిగిలిపోయాడు.

నరసింగరావు తండ్రి గడించిన ఆస్తి చాలా వరకూ బ్యాంకు నిలవల రూపంలోనూ కొద్దిగా ఋణ పత్రాల రూపంలోనూ ఉండెను. పిత్రార్జితం గా ఆయన విడిచిన స్థిరాస్థి అల్లా – వాళ్ళు ఉంటూ వచ్చిన ఒక మేడా, అద్దెకు ఇచ్చిన ఒక చిన్నడాబా. వాళ్ళకు భూములు కూడా ఉండెను. కాని

వానిని అమ్మే నరసింగరావు తండ్రి వర్తకంలో ప్రవేశించారు. నరసింగ రావు ముద్దుబిడ్డ కావటం వల్ల ఇప్పుడల్లా తొందరేమి వచ్చే అంటూ ఆయన ఆ పిల్లవానికి ఎన్నడూ డబ్బు సంపాదించే మార్గాలు నేర్పలేదు. ఏతావాతా ఆయన పోయిన ఈ పద్దెనిమిదేళ్ళలో నరసింగరావు బ్యాంకు నిలవలను, ఋణపత్రాలను చెల్లగొట్టటమే గాక – మేడపైనా, డాబాపైనా ఎంతవరకూ అప్పు పుట్టగలదో అంతవరకూ పూర్తిగా అప్పు చేసి విడిచి పెట్టాడు.

నరసింగరావు చిత్తుగా తాగుతాడనీ, వ్యసనాలకు దోచిపెట్టాడనీ, హద్దూ పద్దూ లేని జూదం ఆడతాడనీ లోకులు పదిమందీ పదిరకాలుగా చెప్పుకుంటారు. కాని ఇందులో నిజం ఎంత ఉన్నదో అతిశయోక్తి ప్రాబల్యం కూడా అంతకు అనేక రెట్లు అధికంగా ఉన్నదనే అనాలి.

నరసింగరావు తాగి ఉండగా గాని, తాగుతూ ఉండగా గాని చూసిన వాళ్ళు ఎవ్వరూ లేరు. ఎప్పుడైనా ఏ స్నేహితుల వత్తిడి వల్లనో దానిని కాస్త మచ్చుచూశాడేమో ఆ సంగతి అతనికీ, అతని స్నేహితులకూ మాత్రమే తెలియాలి. అట్లానే స్త్రీ వ్యసనం ప్రథమ యవ్వనంలో కాస్తో కూస్తో వుండిన మాట నిజం. కాని నిండు యవ్వనంతో అంతకన్నా నిండు సౌందర్య లావణ్యాలతో విశాలాక్షి ఆ ఇంట ప్రవేశించాక అతడు క్రమ క్రమంగా ఆ వ్యసనానికి దూరమౌతూ వచ్చాడు.

ఎటువచ్చీ అతడు భోగి. జూదం ఆడతాడు. మూడవ వ్యసనంగా లోకంచే గుర్తింపబడనిదీ, అతనిలో ఉన్నదీ మనుష్యులంటే అతడికి ఉండే గాఢమైన అపేక్షలు.

నరసింగరావు తన ఆస్తిలో నూటికి తొంబది ఐదు పాళ్ళు వీటికిందనే ఖర్చు చేశాడు. అందులో నాలుగింట మూడు పాళ్ళు అతడు అడిగిన వాళ్ళకూ, అడగని వాళ్ళకూ పంచి ఈయడం వల్లనూ, దరిద్రులైన స్నేహితులూ, కృతఘ్నులయిన చుట్టాలు కింద వ్యయ పరచటం వల్లనూ, తాను పుష్కలంగా అనుభవించటం వల్లనూ పాడైపోయింది. ఒక సినీమా చూడదలచి పదిమంది స్నేహితులను వెంటబెట్టుకొని వందకి తక్కువ కాకుండా ఖర్చు చేసిన సందర్భాలు ఎన్నో వున్నవి. ఒక్క కానీ పోగొట్టుకొని రోడ్డువెంబడి ఏడుస్తూ పోతున్న ఏ పసిబిడ్డనో చూసి జాలిపడి గుప్పెడు కానులు దాని జేబులో పోసినటువంటి ఘట్టాలూ, బీద బంధువుల ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కావలసి వుంటే తానుగా పూనుకొని వందలకు వందలు వదిలించుకున్న ఘట్టాలూ చాలా ఉన్నవి.

అయితే లోకం మొదటి రకం ఖర్చులను లెక్క వేసుకున్నంతగా రెండవ రకం ఖర్చులను లెక్క వేసుకోదు. ఒకవేళ వేసుకున్నా దుబారా ఖర్చు అంటూ చెడుకు చేసిన దుర్వ్యయంలా దానిని లెక్కవేస్తుంది గాని మంచికి వేయదు.

ఇట్లా తాను మహా ప్రవాహంగా కోలుపోతూ వచ్చిన సంపదను తిరిగి గడించడానికి అతడు జూదం ఆడి మిగతా ఆస్తినంతా కోలుపోయాడు.

జూదం అంటే అందరూ అనుకునేటట్టు పేకాట ఒక్కటి మాత్రమే కాదు. పేకాటా, కాటన్ మార్కెట్, రేసెస్, క్రాసువర్డు పజిల్స్ – ఒకటేమిటి ఇలాటివి ఎన్నిరకాలు ఉన్నవో అన్నీను. వీటినన్నింటినీ అతడు ఆదిలో ఉబుసుపోకకు అలవాటు చేసుకొన్నా కొంత కాలానికి అవి వ్యసనాలుగా పరిణమించి కాలక్రమేణా అందులో అతడికి ప్రావీణ్యం లభించడంతో ఇప్పుడతను వానిని వృత్తిగా కూడా స్వీకరించాడు.

జూదం నిశ్చయంగా అవాంఛనీయమైన వ్యసనమే అయినా అది అందరూ అనుకునేటంత ప్రమాదకరమైన వ్యసనం కాదని నరసింగరావు ప్రగాఢ విశ్వాసం. అందులో ఒకనాడు నాలుగు వందలు పోయినా ఇంకొక నాడు మళ్లా ఆ నాలుగు వందలూ వచ్చే అవకాశం కూడా లేకపోలేదు. ఏండ్లకొద్దీ సాధన వల్ల ఎల్లప్పుడూ కాకపోయినా తరచు లాభాన్ని మాత్రమే పొందే ప్రయోజకులు కొందరైనా తయారై ఉండ గలగాలి. లేకపోతే ఓడిపోయే వాళ్ళు పోగొట్టుకుంటున్న డబ్బు ఎక్కడికి పోతున్నదన్న ప్రశ్న ఉద్భవిస్తుందంటాడు నరసింగరావు.

నరసింగరావు తాను ఇప్పుడట్టి ప్రయోజకులలో ఒకడుగా తయారయి నట్టు తలంచడం వల్లనైతేనేం అతడింకొక వృత్తిని దేనినీ అంతపాటి ఆదాయం ఇచ్చే దానిని చేయడానికి తగిన సామర్థ్యం గాని, నైపుణ్యంగాని కలిగి ఉండక పోవడం వల్లనైతేనేం దీనినే అతడు వృత్తిగా పెట్టుకొని నిర్వహిస్తున్నాడు. అయితే అందులో సుగుణమేమంటే అతని ఈ వ్యసనాల లోని ఏ ఒక్కటీ కూడా ఇంతవరకూ అతనిలోని మానవత్వాన్ని పాక్షికంగా నైనా అపహరించుకొని ఉండక పోవడం.

నరసింగరావు ఛామన ఛాయ రంగులో సన్నంగా రివటల్లే ఎల్లప్పుడూ విలువైన బట్టలలో అతి పరిశుభ్రంగా వుంటాడు. అతడు రోగంతో బాధ పడుతుండినప్పుడైనా రోగగ్రస్తుడుగా కనుపిస్తాడా అనిపించేటంతటి ఆరోగ్యవంతుడు. అతనిలోని జీవశక్తి క్షణం ఒకచోట నిలవనివ్వదు. లోకంలోని గెలుపోటములూ, సుఖదుఃఖాలూ, రాగద్వేషాలూ, మొదలయిన సమస్త ద్వంద్వాలకూ అతీతుడా అనిపించేటట్టు ఎల్లవేళలా నవ్వుతూ వుంటాడు.

అంతేకాదు – అతడు బయట ఎట్లా సంచరించినా లోకుల కతడు ఎంత చెడ్డవాడైనా ఇంటికి వచ్చేసరికి మాత్రం అతడు అందరు గృహస్థులకు లానే సంసారం మీద

చూపవలసిన ఆసక్తీ, బంధువుల ఎడ స్నేహం, ఆలిపై అపేక్షా, కనుక్కున్న బిడ్డలమీద వాత్సల్యం నమస్తం లోక సామాన్యంగానే ప్రదర్శిస్తూ వుంటాడు. విశాలాక్షి వరుసబెట్టి నలుగురినీ ఆడపిల్లలనే కన్నా అతడికామెపై గల అపేక్షలలోగాని, ఆ పిల్లలయందు గల శ్రద్ధాసక్తులలో గాని వచ్చిన మార్పు ఏమీలేదు. ఎటువచ్చీ అతడు గార్హస్థ్య పరిపాటికి విరుద్ధంగా ప్రవర్తించేది ఒక్క అత్తవారి యింటి విషయాలలోనే.

అతడికి తన అత్తవారి వంక మనుష్యులన్నా, వారి ఊరన్నా, ఆ ఊళ్ళో వ్యవహారాలన్నా, అక్కడకు సంబంధించిన విషయం ఏది తీసుకున్నా అతనిలో చాలా చిరాకు కలిగిస్తుంది. అందులో మళ్ళా శ్రీరామారావు విషయం వస్తే దాని పద్ధతి అంతా వేరేగా వుంటుంది.

## 7

నరసింగరావుకు తన అత్తవారన్నా, వాళ్ళ వ్యవహారాలన్నా ఒట్టి చిరాకూ ఇంతో అంతో కోపమే గాని ఆ అత్తవారికి అతడన్నా అతడి వ్యవహారాలన్నా చాలా అసహ్యం, ద్వేషం కూడా.

అతని విషయం వచ్చేసరికి వాళ్ళు తమ పిల్ల సౌందర్య గుణగణాల నన్నింటినీ అట్టి పిల్లకు అటువంటి 'నిర్భాగ్యుడు' భర్తగా దొరకడాన్ని గురించి – 'కాకి ముక్కుకు దొండపండు కట్టినట్టు కట్టేశాము' అంటూ 'దాని తలరాత అలా ఉన్నది' అని నిట్టూరుస్తారు. కట్టిన వారిని నిందిస్తున్నట్టు వాచ్యార్థం నిరూపిస్తున్నా దాని వెనుక ధ్వనించే వ్యంగ్యార్థం కట్టుకొన్న వాడిని నిరసించటమే.

విశాలాక్షి పెండ్లి సందర్భంలోనే వెంకట నర్సమ్మగారు వారి ఈ మేనరికపు సంబంధం యెడల తమ అయిష్టతను చాలా బలంగా ప్రకటించి ఉన్నారు. కాని అప్పట్లో ఆ ఇంట హయాం చలాయిస్తూ ఉండిన ఆమె అత్తగారు మొగవాడికి అందమెందుకనీ, అందం కొరుక్కు తింటారా అనీ ఎక్కడెక్కడి అడ్డమైన కుతర్క కుఠారాలనూ ఎరువు తెచ్చుకొని వాడి, ఆమె వాదనలన్నింటినీ ఖండించి ఆమె నోరు మూయించింది. వెంకట నర్సమ్మగారి భర్తకూడా పిల్లవాని ఆస్తిపాస్తులూ ఏకైక వారసత్వం ప్రలోభాలుగా చూపి ఆమెనెట్లానో మెడలు విరిచి తమ పనిని పూర్తి చేసుకున్నారు. కాలగతిని సమస్తం తారుమారు కాగానే 'నేనప్పుడే అన్నాను విన్నారు కాదు' అంటూ నెత్తీ నోరూ మొత్తుకోవడం ఆరంభించింది.

తండ్రి పోయాక నరసింగరావు ప్రవర్తనలో వస్తూ ఉండిన తీవ్రమైన మార్పులను గురించి విశాలాక్షి కాపురానికి వెళ్ళిన ఏడాదీ ఏణ్ణర్ధం వరకూ కూడా ఇక్కడి వారికి ఎవ్వరికీ ఏమీ తెలీలేదు. ఆ పిల్ల రెండు మూడుసార్లు అత్తింటికి పోయి రావడంతో ఆమె ద్వారా కొంతా, ఆమె వెంట వెళ్ళి వచ్చేవారి ద్వారా మరికొంతా చొప్పున క్రమ క్రమంగా విషయమంతా అందరికీ తెలియసాగింది.

శ్రీరామారావు తండ్రికి మొదట్లో ఏం చేయాలో పాలుపోలేదుకాని ఒక ఏడాదిపాటు నరసింగరావును సంస్కరించడానికి ఎన్నెన్నివిధాల, ఎంద రెందరి ద్వారా ప్రయత్నించాలో అన్నన్నివిధాల, అందరందరి ద్వారానూ ప్రయత్నించి ఫలితం లేకపోగా ఆయన కొంతకాలం కూతుర్ని తన దగ్గర అట్టే పెట్టుకున్నారు.

ఆరోజుల్లోనే 'అసలు వాళ్ళు పిల్లను కాపురానికే పంపించరుట' – అంటే, నరసింగరావు రెండవ పెండ్లి చేసుకుంటాడుట – అనీ, విశాలాక్షి తండ్రి మనోవర్తి దావా తెస్తాడు – అంటే, 'ఆ మాత్రం తెలివితేటలు నరసింగరావుకు కూడా లేకపోలేదు' అనీ, ఇట్లా ఎన్నెన్నో లోక ప్రవాదాలు రకరకాలుగా బయలుదేరినవి.

చివరకు ఎవరో పుణ్యాత్ములు దేవుడు పుట్టించిన సద్బుద్ధితో ఆ అల్లుడు మామల మధ్య ఎట్లానో రాజీ కుదిర్చిపెట్టారు. దానివల్ల ఆ రెండు కుటుంబాల మధ్యా ఏర్పడ్డ పొరపొచ్చాలు నసించక పోయినా, విశాలాక్షి కాపురం కుదుటపడ్డది.

ఆనాటి దుమారాల ఫలితంగానే నరసింగరావు ఇప్పటికీ ఏవో పెద్ద పెద్ద కార్యాలూ, కథలూ అయితే తప్ప ఆ ఇంటికి బంధుసరళిగా రాడు. అతడి భార్య విశాలాక్షి రాకపోకలు కూడా తక్కిన ఆడపిల్లలతో సరిపోల్చి చూస్తే చాలా తక్కువనాలి.

వెంకట నర్సమ్మగారు కూడా వీనినన్నింటినీ పూర్తిగా మరచిపోలేదు. సహజమే. విశాలాక్షి భర్తగా నరసింగరావే జరిగినదల్లా మరిచిపోలేన ప్పుడు తల్లిగా ఆమె మరచిపోలేక పోవటంలో వింత లేదు. ఆమె ఇప్పటికీ తమ అల్లునిపై గల ఆక్రోశాన్ని తీర్చుకోవటానికి ఏమాత్రం అవకాశం దొరికినా జారవిడవకుండా జాగ్రత్తగా పట్టుకొంటుంది.

విశాలాక్షి వచ్చినప్పుడల్లా వెంకటనర్సమ్మగారు ఆమె అత్తవారింటి భోగట్టాలూ, నరసింగరావు ప్రవర్తనా విశేషాలూ, తరచి తరచి అడుగుతూ ఉంటుంది. చెపితే వాటికి అన్నింటికీ చిలవలకు పలవలూ పలవలకు చిలవలూ చేర్చి, ఇంటా ఇంటా వాడా వాడా ఆ విషయాల నన్నింటినీ ప్రచారం చేసి అనవసరపు ద్వేషాల నన్నింటినీ పెంచుకుంటూ వస్తుంది. గతంనుండి నేర్చుకున్న పాఠాలతో జాగ్రత్తపడి విశాలాక్షి ఏమీ చెప్పకపోతే అది కూడా ఒక చెప్పరాని గట్టి చిక్కే. ఒకసారి

కనుక్కున్న తల్లికంటే కట్టుకొన్న మొగుడు తనకు దగ్గరవాడు అయ్యాడా అన్న ధోరణిలో "ముండా మొగుడు! ఆ మొగుడు తన బ్రతుకునలా బద్దలుచేస్తూ వుంటేనే వాడి కోసరం పడి చస్తూన్నదది. నిజంగా వాడే నిరవాకం చేసే మొగుడైతే ఇంకెంతగా పడి చచ్చిపోయేదో" అంటూ విశాలాక్షిని బజాయిస్తుంది. వేరొకసారి "చెప్పనివ్వదే! చెపితే దానిని ఉంచుతాడటే బద్దుపట్టుక పీకడూ?" అంటూ అప్పుడు కూడా నిందంతా అల్లునిమీదే తోసివేసి ఆ విధంగా కూడా అతనిపై దుష్ప్రచారమే కొనసాగిస్తుంది.

నిజానికి శ్రీరామారావు అభిప్రాయపడేట్టు, లోకం దృష్టిలో కావలసిన దానికన్నా ఎన్నోరెట్లు ఎక్కువగా చెడ్డవాడైన నరసింగరావు అట్లా కావడానికి ప్రధాన హేతువు వెంకటనర్సమ్మ గారే. దూరదృష్టి రహితములైన తమ ఆ దుష్ప్రచారాలతో తానేం చేస్తున్నదో తెలుసుకోగల ఓపికగాని తెలివిగాని, ఆ తల్లికి ఆమె లోకజ్ఞానం, సంస్కారం ఏమాత్రం కూడా ప్రసాదించి ఉండలేదు.

ఒక్క శ్రీరామారావు తప్ప ఆ ఇంట తక్కిన వాళ్లంతా కూడా ఆమెకే వత్తాసిచ్చి ఆమెలోని ఈ అగ్నిని తాము సహితం యధాశక్తిని రాజవేస్తూ అనేకమైన అపోహలకూ, అసంబంధ్ధ సంఘటనలకూ కారణమవు తుంటారు. వాళ్ళు ఇట్లా చేయడంలో కొంత ఇచ్చకం, మరికొంత అజ్ఞానం హేతువులు కాగా అన్నిటికన్నా బలవత్తమమైన ప్రేరేపణ వాళ్ళందరకూ ఆ నరసింగరావుపై గల విద్వేషం. తమకు నరసింగరావుతో గల బాంధవ్యం వల్ల తాము కూడా లోకుల దృష్టిలో చారిత్రకంగా హీనులవవలసి వస్తున్నదని వాళ్ళ భావన. అట్లాంటి భావనల వల్ల ఆ ఇంట అందరికన్నా ఎక్కువగా బాధపడే వ్యక్తీ తాను ఉన్నత వంశీకురాలనని భావించే ఆ ఇంటవారి పెద్దకోడలు శ్రీదేవి.

## 8

శ్రీదేవికీ విశాలాక్షి సంబంధమైన ఈ చరిత్ర విశేషమంతా సవివరం గానూ, సత్య సమ్మతంగానూ తెలియదు కాని ఇందులో లోకులు యే ఘట్టాలను గూర్చి వివిధ పాఠాంతరాలలో విశేషంగా చెప్పుకుంటారో ఆయా ఘట్టాలను గూర్చి ఆమెకు కూడా చాలా తెలుసు.

శ్రీదేవి పుట్టింటివారి పొరుగున ఒక ఉబుసుపోని యిల్లాలు ఉండెను. ఆ యిల్లాలి ఆడపడుచుగారిదీ, విశాలాక్షి అత్తవారి కుటుంబానిదీ, ఒక్క ఊరే కాక ఒక్కటే వీధి. ఆమె ద్వారా శ్రీదేవి తన ఆడబడుచు గారి కుటుంబాన్ని గూర్చి చాలా తెలుసుకొన్నది. శ్రీరామారావు కూడా పెండ్లి అయిన కొత్తలో కొంత చెప్పి ఉన్నాడు. ఆ రెండింటి మధ్యా వైరుధ్యం చాలా ఉన్నా అందు ఎవరిమాటలు నమ్మాలో శ్రీదేవికి బాగా తెలుసు. అదికాక శ్రీదేవి అధికంగా తెలుసుకొన్నది – గత సంవత్సరం ఈ నడుమా విశాలాక్షి భర్తయొక్క ఆర్థిక దుస్థితి పెరిగి పెరిగి నేడో రేపోగా పుట్టి ముంచడానికి సిద్ధమై ఉన్నదని.

ఈవిధమైన చరిత్ర దృష్ట్యానే ఆమె మొట్టమొదట విశాలాక్షినను మానించ గలగడానికి సాహసించింది. దానికితోడు ఆమె తన్ను తాను సమర్ధించుకోవడానికి కొన్ని – బలహీనమైనవే అయినా – ప్రత్యక్ష కారణాలు కూడా లేకపోలేదు.

విశాలాక్షిపై ఆమె తొలి అనుమానాలు ధ్రువపరచుకోవడానికి ప్రారంభించినది – లగ్నం వెళ్ళిన మరునాడు, పగలు భోజనాల వేళకు కాస్త ముందుగా.

ఆవేళప్పుడు తాను ఏదో మరచి విడిదికి రాగా అక్కడ ఒంటరిగా ఉన్న విశాలాక్షి తనను చూచి తుళ్ళిపడినట్టు అనుమానం కలిగింది శ్రీదేవికి.

అంతకు ముందే ఆమె ఆ ముందు రాత్రి జరిగిన విచిత్ర సంఘటనను ఒక దానిని జ్ఞాపకం తెచ్చుకొని ఉన్నది. విడిదిలో దిగిన మరునాటి రాత్రి అంటే నగ పోయిన నాటి రాత్రే పదీ పదిన్నర గంటలప్పుడు విశాలాక్షి చీకటిలో పెరట్లోకి పోయి వస్తూ – వచ్చి వచ్చి పెరటి వరండాలో ఒక స్తంభానికి చేరబడి పోయి మెడలు వేలాడ వేసేసిందట. ఎవళ్ళో ఎందుకో పెరట్లోకి పోయిన వాళ్ళు ఆమెను పలకరించారు. ఆమె పలుకకపోగా వాళ్ళు భయపడి గోల చేశారు. పదుగురూ ఆమె చుట్టూ చేరి చూస్తే మనిషి అప్పటికింకా కండ్లు తెరుచుకొనే ఉన్నది. చూస్తూ ఉండగానే ఆమె విశాలమయిన కన్నులు మూతలు పడుతూ ఉండగా శరీరమల్లా – ఆపాద మస్తకం – చెమటలు పోయసాగాయి. ఇంతలో ఎవరో నీళ్ళు తెండర్రా అని కేక వేశారు. శైత్యోపచారాలు చేయగా ఆమె తేరుకొన్నది.

ఆ రాత్రే పన్నెండు, ఒంటి గంట నడుమ ఆమెకు దయ్యం పట్టినట్టు ఉందని కూడా కొందరు ఆడవాళ్ళు గోల చేసినట్టు జ్ఞాపకం. శ్రీదేవికి నిద్రమత్తు భారంగా ఉండటం వల్లనైతేనేం, ఇట్లాంటి వాటిలో నమ్మకం లేకపోవడం వల్లనైతేనేం అప్పుడాట్టే ఆ విషయమై పట్టించుకోలేక పోయింది. ఇప్పుడీ సంఘటనల దృష్ట్యా దానిని విచారిస్తే దాని అంతరార్థం నిశ్చయంగా ఇదే అయి వుండాలనిపించింది శ్రీదేవికి.

తదాదిగా ఆమె విశాలాక్షి ఎక్కడ కూర్చుంటే అక్కడల్లా కూర్చొని వెన్నాడటం ఆరంభించింది. విశాలాక్షి ప్రవర్తన కూడా అందుకు తగినట్టే ఆమె అనుమానాలను క్షణక్షణం బలపరస్తూనే ఉండెను.

శ్రీదేవి తన వంక చూసినప్పుడల్లా విశాలాక్షి తన పెద్ద

కన్నులను అరవాల్చి ముఖం పక్కకు మరలించుకొంటుండేది. ఆమెను తాను చూసే చూపులతో విశాలాక్షి విలవిలలాడి పోతున్నదా అనిపించేది శ్రీదేవికి. దగ్గరకు పోతే ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గతి తప్పుతున్నట్టు స్పష్టంగా కనుపట్టేది. పరధ్యానంగా ముట్టుకున్నట్టు చూసి ఒళ్ళు కూడా వేడిగా ఉన్నట్టు గ్రహించింది శ్రీదేవి. ఆ తరువాత విశాలాక్షి ఉష్ణం వచ్చిందంటూ తల్లిచేత దిష్టి తీయించుకొని పండుకొన్నది. కాని అందులోని అంతరార్థాన్ని గ్రహించలేనంత మూర్ఖురాలు కాదు శ్రీదేవి.

ఆ వాళల్లా ఇంట్లో విశాలాక్షిని వెంటాడుతూ వుంటే శ్రీదేవికి ఇంకొక విషయం కూడా గుర్తుకు వచ్చింది. నరసింగరావు ఈ పెండ్లికి రాకపోవ డానికి కారణం కూడా అదే అయివుండాలి.

ఆ నడుమ ఆరేడు నెలల క్రితం శ్రీరామారావుకు కాలేజీ ఎడ్రసుతో విశాలాక్షి వద్ద నుండి ఒక వైరు వచ్చింది. అందులో తక్షణం ఐదు వందల రూపాయలు పంపమనీ, ఉత్తరం తరువాత వస్తుందనీ వ్రాసి వున్నది. ఈ విషయం శ్రీరామారావు ఎన్నడూ శ్రీదేవితో చెప్పి ఉండలేదు. వైరు ఇంటి యడ్రసుకు రాకపోవటంలోని అంతరార్థమే అది. కాని ఒక వారం రోజుల తరువాత అనుకోని విధంగా దాని సంగతి శ్రీదేవికి పట్టుపడ్డది. ఆ సందర్భంలో తనకూ భర్తకూ జరిగిన సంఘర్షణను శ్రీదేవి మరిచిపోలేదు.

శ్రీదేవికి నీతి నియమాలను గూర్చిన ఉద్దేశాలు కొన్ని తీవ్రమైనవి ఉన్నవి. ఆమె తెలుసుకున్న విలువల ప్రకారం దొంగతనం, వ్యభిచారం మొదలైన దుర్వృత్తులకు లోనయ్యే వాళ్ళు ఎవరైనా, ఏ పరిస్థితుల్లోనైనా వాళ్ళు నిందార్హులే కాని క్షమార్హులు కారు.

వాళ్ళను క్షమించటం, అంతకన్నా వాళ్ళను క్షమిస్తున్న విషయం బయటకు వ్యక్తం చేయటం, వాళ్ళను సన్మార్గంలో పెట్టడానికి తోడుపడవు సరికదా వాళ్ళకు ప్రోత్సాహ కారణాలవుతాయి. అన్నిటినీ మించి అట్లా చేయటంలో తమ విశాల హృదయాన్ని ప్రకటించుకోవటమనే పరవంచనతో పాటు ఇతరులా హృదయ వైశాల్యాన్ని చూసి మూర్ఛ పోతారనుకునే ఆత్మవంచన కూడా ఎంతో ఉన్నది.

ఇట్టి విలువలూ, భావాలూ ప్రాతిపదికలుగానే ఆమె ఆనాడు తన భర్తతో నరసింగరావును గురించి వాదనకు తలపడి అతి తీవ్రంగా వాద ప్రతివాదాలు జరిపి ఉన్నది. ఆ సందర్భంలో శ్రీరామారావు ఆమె వాదనలను ఎదుర్కోలేక అత్యాచారానికి పోయి కూట వాదనల సహాయంతో ఆమెను అన్యాయంగా మర్మాంతకములయిన ఒక రకపు గూఢ వేదనలకు ఎరచేసి మానసికంగా బాగా గాయపరచి ఉన్నాడు.

దానా దీనా ఆమె తన నగను తాను మళ్ళా చిక్కించుకోవటంతో పాటు వీలయితే ఈ దొంగతనాన్ని సాధ్యమైనంత బాహాటంగా పట్టుకొని తద్వారా శ్రీరామారావుదైన ఆత్మోత్కర్షపై గాఢమైన దెబ్బ వేయాలని నిశ్చయించుకొన్నది. చివరికామె సర్వకామనలనూ పరితృప్తి చేస్తూ ఆ మరునాడు మధ్యాహ్నం మూడవ యామం అత్యంత భీభత్సకరమైనది ప్రవేశించింది.

పెండ్లి బాగానే జరిగిందని మగపెండ్లి వారనుకుంటే చాలా బ్రహ్మాండంగా జరిగిందని ఆడపెండ్లి వారి తరఫున వచ్చిన వారంతా అన్నారు. ఊరునా నాడునా ఉండే ప్రజలంతా ఈ పెండ్లి తక్కిన ఆ ఇంటి పెండ్లిండ్లన్నింటికన్నా ఘనంగా జరిగిందని ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కూడా మెచ్చుకున్నారు.

మగపెండ్లి వారి తరఫున వచ్చిన వారిలో మగవాళ్ళ సంఖ్య తక్కువ. ఆడవాళ్ళ సంఖ్య హెచ్చు. అందుచేత ఏ కాస్తో సందడి చేస్తే వాళ్ళే చేస్తూ వచ్చారు. వాళ్ళ తరఫున వచ్చిన మగవాళ్ళంతా పెద్దమనుష్యులుగా కూర్చోవటంలో గల సరదా – హాస్యాలూ, పరాచికాలూ ఆడుకోవటంలో పొందలేనట్టు కనిపించారు.

ఆడపెండ్లి వారి తరఫున వచ్చిన బంధువులలో మగవాళ్ళ సంఖ్యా ఆడవాళ్ళ సంఖ్యా ఇంచుమించు సమానం. అసలు వాళ్ళ కుటుంబం కూడా శ్రీరామారావు గారి కుటుంబంకన్నా ఇంతో అంతో పెద్దది. పెండ్లి కూతురుకు నలుగురన్నలూ, ముగ్గురు అక్కలూ ఉన్నారు. ఆ అక్కల మొగుళ్ళూ, అన్నదమ్ములూ అంతా సమాన వయస్కులు. వాళ్ళందరూ ఏళ్ళు మీరిన వారూ, ఉద్యోగస్తులే అయినా ఆ నాలుగు రోజులూ తమ వయసులూ, ఉద్యోగాలూ మరచి చిన్నపిల్లల్లా మసలుతూ వచ్చారు.

వాళ్ళు పెళ్ళి పందిట్లోనూ అక్కడా చేసిన అల్లర్లూ, ఆగడాలూ ఇన్నీ అన్నీ కావు. కొట్టుకోవడం, ఒకర్నొకరు వెంట దరమటం, విరగబడి నవ్వుకోవడాలూ, దొంగ దొంగ ఏడుపులూ, బీరాలు పలకడాలూ, కుహనా రోష ప్రదర్శనాలూ, ఉడికింపులు ఒకటేమిటి ఎన్నెన్ని పోకిళ్ళు పోగలరో అన్నన్ని పోకిళ్ళూ పోతూ వచ్చారు.

వాళ్ళ భార్యలూ ఇతర బంధువులూ, ఒక వంక సామానుల అందింపులూ, వంటలూ, వడ్డనలూ, మొదలయిన పెళ్ళి పనులు చూసు కుంటూనే, వేరొక వంక వాళ్ళ చిలిపి చేష్టలలోనూ, పోకిరీ వేషాలలోనూ పాల్గొంటూ వాటిని మరింత రసవత్తరములు చేసేవారు. పెండ్లి కూతురు తల్లీ తండ్రీ అరవయ్యో పడిలో పార్వతీ పరమేశ్వరుల్లా వుంటారు. వాళ్ళు చిన్నవాళ్ళలా ప్రవర్తించే తమ ఈ పెద్ద పిల్లలను చూసి

"ఏమిటర్రా అదీ" అని ఒక వంక అలవాటుకొద్దీ అదలిస్తూనే, వేరొక వంక వారు పొందే ఆనందం ఇంతా అంతా కాదు.

శ్రీరామారావు ఆ కుటుంబాన్ని చూశాక తమ కుటుంబ జీవితం, దాని బంధుబాంధవ్యాలూ, ఆ కుటుంబానితో సరిపోల్చుకొని తమవి ఎంత రసహీనంగానూ, విషాదభరితంగానూ ఉన్నవో అర్థం చేసుకొన్నాడు. తాను పొందిన సంస్కార ఫలితంగా అతడట్లాంటి వాటిని స్వయంగా ఆనందించే శక్తిని కోల్పోయినా యితరులానందిస్తూ ఉంటే చూసి సంతోషించే శక్తి మాత్రం ఇంకా కోలుపోలేదు.

శ్రీదేవికి ఇదంతా శుద్ధ మొరటు వ్యవహారం అవటం వల్ల ఆమె మార్గంలో ఇట్లాంటివి తారసపడితే మొహం చిట్లించుకొనేది. వారు కూడా ఆమెను చూడగానే ఒకరికొకరు సైగలు చేసుకొంటూ ఆమె యొక్క నాగరిక వైఖరిని తమ తమ సాంకేతిక పరిభాషలలో పరిహసించి నవ్వుకునే వారు.

ఊళ్ళో వాళ్ళకు – పెద్ద బ్రహ్మాండంగా లగ్నం, మందుగుండు సామానుతో, మంగళ వాయిద్యాలతో, ఇరవై ముప్పయి పెట్రోమాక్సు లైట్లూ, గ్యాస్ లైట్లతో ముత్యాల పల్లకిలో వధూవరుల ఊరేగింపూ, పండితులతో సదస్యం, పెద్ద పేరెన్నికగన్న దాసుగారిచే హరికథా, సమస్తం చాలా చక్కగా అమరినాయనిపించినది. నాగవల్లినాడు ఊరిలో మిగిలిన వర్ణాల వారికందరికీ పెద్ద ఆమెత కూడా ఏర్పాటు చేశారు. చివరగా అప్పగింతలు యధావిధిగా జరిగినవి. నాగవల్లితో వివాహకాండ సమస్తం పరిపూర్తి.

★ ★ ★

ఆ మధ్యాహ్నం పెండ్లివారి ఇంటి దగ్గర పెద్ద ఊరామెత జరుగుతూ వుంది. రాత్రి హరికథ కారణంగా నిద్రలేమి వల్లనేమి, సాధారణంగా మధ్యాహ్న భోజనానంతరం కలిగే భుక్తాయాసం వల్లనేమి మగపెళ్ళి వారు విడిదిలో ప్రయాణాలై వెళ్ళగా మిగిలిన వాళ్ళు పడి నిద్రపోతున్నారు.

నిజానికి లోకం పరిపాటిని ఆసరికి పెండ్లి వారంతా ప్రయాణోన్ముఖులై ఆ సన్నాహాలలో ఉండాలి. కాని ఆనాడే పునఃసంధానానికి ముహూర్తం పెట్టబడటం వల్ల పెండ్లి కూతురు తండ్రీ అన్నదమ్ములూ తాము చేయగల శుభకార్యాలన్నింటిలోనూ అదే కడపటిదంటూ, ఆ ఒక్క పూట కూడా అందరూ ఉండిపోయి వధూవరులను ఆశీర్వదించి పొమ్మంటూ మనిషి మనిషినీ బలవంతంచేసి చాలామందిని నిలిపివేశారు. ఆడపెండ్లి వారిలో మిగిలిన వారు అధికంగానే ఉన్నారు. వాళ్ళంతా ఆమెతకు సంబంధించిన వంటలో, వడ్డనలో వున్నారు.

మూడు మూడున్నర గంటలయ్యేసరికి విడిదిలో ఇంకా ఎవ్వరూ లేవలేదు. నీరవంగా వున్న విడిదిలో నిద్రపోతున్న శ్రీదేవికి నిద్ర ఎలా అనుకోకుండా పట్టిందో తెలివి కూడా అలానే అనుకోకుండా కలిగింది. కొంత సేపటి వరకూ తానానాడు నిద్ర పోకూడదనుకుంటూనే నిద్రపోయిన సంగతి జ్ఞాపకం చేసుకోలేదు. తరువాత అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చేసరికి ఆమె చప్పున లేచి కూర్చున్నది.

ఆ రెండు రోజుల నుండీ తాను పడుతూ వచ్చిన జాగరూకత అంతా శుద్ధ నిష్ప్రయోజనమై ఉంటుందనుకుంటూనే ఆమె విశాలాక్షి పండుకున్న పక్క వంక చూసింది. విశాలాక్షి అక్కడలేదు.

అంతే, అంతటితో సర్రున ఆమెలోని చైతన్యస్రవంతి సర్వస్వం ఒక్క అదటున ఆమె హృదయకుహరంలో ప్రవేశించి అక్కడ ఆమెలో సుడులు తిరగనారంభించింది. ఆ అదటుకి కొంతసేపు ఆమె స్తబ్ధత వహించి అట్టానే వుండి పోయింది. తరువాత ఆమె ఒక్క లిప్త కూడా వృథా చేయరాదనే ధోరణిలో పెరటి వరండాలోకి పోయింది. అక్కడ ఆ పెరడల్లా ఫాల్గుణమాసపు మధ్యాహ్నపుటెండలో ఒక చిత్రమైన అనుభూతిని – శ్రీదేవికి కూడా, ఆ స్థితిలో సహితం, కలిగిస్తూ ఉన్నది. కాని అందందు ఎక్కడా విశాలాక్షి మాత్రం శ్రీదేవి కంటికి కానరాలేదు.

ఆమె వరసపెట్టి గదులన్నీ ఒక్కటొక్కటే చొప్పున వెదుకుతూ వచ్చింది. వాటిలో ఎందరెందరో నిద్రపోతున్న వారు కనుపించారు గాని విశాలాక్షి మాత్రం ఎక్కడా కనుపించలేదు. మరి ఒకసారి పెరడల్లా వెతికి అటుపోయి ఉండదు అనుకుంటూనే పెరట్లోంచి నట్టింటి గదికి గల ద్వారం దగ్గరకు వచ్చేసరికి వీధిలోంచి నట్టింటిలోకి వస్తున్న విశాలాక్షి వీధి ద్వారం దగ్గర ఎదురుపడ్డది శ్రీదేవికి. ఇద్దరూ గదికి ఈ ద్వారం వద్ద ఒకరూ ఆ ద్వారం వద్ద ఒకరూగా అట్లా ఒకరి వంక ఒకరూ చూస్తూ క్షణకాలం నిలుచుని ఉన్నారు.

చివరకు శ్రీదేవే ముందుగా కదిలి గదిలో ప్రవేశించగా విశాలాక్షి కూడా ఇంక తప్పనిసరి కాగా ముందుకు జరిగింది. ఇద్దరూ గది నడుమ ఒకరికొకరు గజమూ గజమున్నర దూరానికి వచ్చి ఆగిపోయారు. వాళ్ళకు ఒక దిశగా పొడవునా ఉన్న గదిలో పది పదిహేనుమంది వరకూ పండుకొని ఉన్నారు. రెండవ దిశగా గజం దూరంలో పక్క గదిలోనికి పోయే ద్వారమున్నది.

శ్రీదేవి తన ఆడబడుచును చూడక ముందు నుంచీ ఆ క్షణాన ఆమె వద్ద తన చోరీ ఆస్తి తప్పక దొరుకుతుందని తెలుసు. ఎట్లా తెలుసునంటే మాత్రం ఆమె చెప్పలేదు. ఇప్పుడు విశాలాక్షి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీసే పద్ధతీ, చూసే చూపు, ఆ విశాలమైన నుదురు కొంచంగా చమట పట్టటం ఇవన్నీ

ఆమె ఊహను బలపరచడానికి ఉపయోగపడేవే కాని వాటినిబట్టి కొత్తగా ఊహించవలసినది ఏమీలేదు. అంతేకాదు ఆ వస్తువు ఎక్కడ ఉన్నదో కూడా ఆమెకు బాగానే తెలుస్తూ వున్నది. ఆమె ఎరిగినది స్వల్పమే అయినా అందులోనే ఆ ఆడుబిడ్డ పైట చెరగు వీపు చుట్టూ తిప్పి కుడిచేతి కిందనుండి ముందుకు తీసి బొడ్డు కొంగు కిందకి పెట్టుకొని ఉండగా చూడటం ఇదే మొదటిసారి. అందుచేత వస్తువు అక్కడే ఉన్నదన్న సంగతి కూడా ఆమె ఆమెను చూడగానే గ్రహించింది.

క్షణకాలం ఇద్దరూ అట్లా మవునంగా నిల్చుని ఉన్నాక శ్రీదేవి పట్టుక పోతున్న గొంతును సవరించుకొంటూ అన్నది.

"ఏది వదినా! ఆ చీరకొంగు కాస్త బయటికి తీయండి" అన్నది – అప్పటికి నెమ్మదిగానే.

ఆమెకా క్షణాన తాను చేస్తున్న సాహసమేమో దాని ఫలితం యెట్టిదో ఏమాత్రం కూడా ముందుగా తెలిసినట్టు లేదు. ఆమెకు అప్పట్లో కనిపిస్తున్నదల్లా ఒక్కటే విషయం. తాను ఈ మూడు రోజులై పడుతూ వచ్చిన శ్రమా ఆ క్షణాన ఫలించనున్నది. తాను కలగనినట్టుగానే చోరీ ఆస్తితో సహా దొంగ పట్టుబడిపోతున్నది. అంత చిత్రంగా ఎవ్వరూ ఎప్పుడూ ఏ దొంగతనాన్నీ పట్టుకొన్నట్టు తాను విని ఉండలేదు. ఆ సందట్లోనే ఆమె సమస్తం మరచి అట్లా ఒక ఉద్రేకపు టుద్వేగంలో పడి కొట్టుకపోతూ అన్నది –

"తియ్యండి వదినా! పైట చెరగు బయటకు తీయమంటే అట్లా చూస్తారేం?" అన్నది గొంతుక కాస్తగా పెద్దది చేస్తూ.

ఈసారి ఆమె గొంతులో కాస్త కంపరమున్నది. మనిషి కూడా ఏమాత్రమో కంపిస్తూ ఉన్నది. విశాలాక్షి అట్లా కొయ్యబొమ్మలా చూస్తూనే ఉండిపోయింది. ఆమె ముఖంలో కత్తివేటుకు నెత్తురుచుక్క ఎక్కడా లేదు.

క్షణక్షణం నీరు విడిచిపోతున్న ఆ మానవి హృదయంలో భూకంపాల వంటి వేవో కలుగుతున్నవనీ ఆమె ఆత్మ ఆ పగుళ్ళలో పడి అథః పాతాళాలలోనికి ఆర్చుకుంటూ కొట్టుకొని పోతున్నదా అనీ అనిపించింది శ్రీదేవికి. అయినా ఆమె కెందుచేతో ఆ క్షణాన తన ఆడబడుచుపై జాలి మాత్రం కలగలేదు. రెండుసార్లకూ పలకక పోయేసరికి మూడవసారి కూడా ఆ మాటలే కాస్త మార్పులు చేస్తూ గొంతును మరి కాస్తగా హెచ్చిస్తూ అన్నదామె.

అంతటితో ఆ గదిలో పండుకొన్న వారిలో కొంతమందికి తెలివిరాగా లేచి ఈ విచిత్ర దృశ్యాన్ని పక్కల మీదునుండే చూడసాగారు. పక్క గదిలో రానున్న రాత్రిని తలచుకొంటూ నిద్రపట్టక బాధపడుతున్న పెండ్లికొడుకు మగత నిద్దురలో నుండి చప్పున లేచి పక్క ద్వారం దగ్గరకు వచ్చాడు. వదినగారి గొంతుక విని కంగారుపడ్డ ఆ యువకుడు వాళ్ళ అవతారాలు చూసేసరికి ఆ స్థితిలో మతి పోగొట్టుకున్నాడు. రెండు రోజులయీ ఆ వదినగారు ముఖం ఇట్టే పెట్టుకొని ఉన్నారనీ ఒకసారి ఏడవటం గూడా జరిగిందనీ విని ఉన్నాడేమో దానినంతా దేనినిగానో అర్థం చేసుకుంటూ వచ్చాడు. ఇప్పుడీ దృశ్యం చూసేసరికి ఏమని అర్థం చేసుకొన్నాడో అతి అస్వాభావికమైన గొంతుకతో –

"ఏమిటదీ? ఏమిటయిందీ?" అంటూ ప్రశ్నించసాగాడు.

ఈ గొంతు కూడా విని అక్కడ పండుకొన్న వారిలో ఇంకొక ముగ్గురు, నలుగురు లేచారు. అందులో వెంకట నర్సమ్మగారు కూడా ఒకరు; వాళ్ళెవ్వరూ ఇంకా పక్కలు విడిచిపెట్టలేదు. సూర్యం మళ్ళా అడిగాడు.

"ఏమిటిదంతా!? ఏమిటంటారు మీరూ? పైట చెరకు ఎందుకు తీయాలీ?" అన్నాడతడు.

"తియ్యమనండి చెప్తాను" అన్నది శ్రీదేవి.

ఆ గొంతులో ఇమిడి ఉన్న ఏదో ఒక శక్తికి లొంగిపోయిన సూర్యం ఆ సవాలుకి కోపం తెచ్చుకోవడానికి బదులుగా స్వస్థత చెడగొట్టుకొని–

"తియ్యవే!" అన్నాడు అక్కను ఉద్దేశించి.

విశాలాక్షి తీయలేదు.

సూర్యం దృక్పథపుటంచున అతని కెదురుగా అతని తల్లి వున్నది. ఆమె వంక దృష్టిని నిగుడిస్తూ–

"నువ్వు వచ్చి తియ్యవమ్మా" అన్నాడు తల్లితో.

ఆవిడకు ఇది అంతా ఏమిటో బోధపడడం లేదు. ఆవిడక్కూడా తెలిసినదల్లా శ్రీదేవి ఈ రెండు రోజులయీ కళ్ళల్లో నిప్పులు పోసు కొంటున్నది' అని. అందుచేత ఆమె ఆ పరిస్థితిలో శ్రీదేవిని చూసి, అప్పుడే వచ్చిన తెలివిలో ఒళ్ళుమండనారంభించగా–

"ఏమిట్రా తియ్యమంటావ్? ఏమిటి తియ్యమంటావ్?" అన్నది కొడుకు నుద్దేశించి.

"నువ్విలా రా" అంటూనే – తల్లి వత్తాసు చూసుకోగానే వదిన గారిపై వచ్చిన ఆకస్మిక కోపాన్ని, తల్లి జాగు చేయడంతో పట్టుకోలేక, వళ్ళు మరుస్తూ చప్పున వెళ్ళి అక్క చెల్లెలు బొడ్డు కొంగులో నుండి పైట చెరకు చివరను తానే ఊడదీశాడు.

అందులో ఏమీ లేదు.

క్షణకాలం శ్రీదేవి గుండెలు గతుక్కుమన్నవి. కానీ ఇంకా అక్కడ కొంత ప్రదేశం ఎత్తుగా ఉండటం చూడగా ఆమె గుండెలు మళ్ళా లోపల నుండి పైకి తేరుకోసాగినవి.

ఈలోగా ఆమె రిచ్చపాటు చూసిన సూర్యం అసలే ఒళ్ళు మరచిపోతూ పెద్ద గొంతుకతో–

"ఏమున్నదండీ?! ఏమున్నదక్కడా?" అన్నాడు: అతని

గొంతు ఖంగున మారుమోగున్నది ఆ గదిలో.

మంట, మంటను రగిల్చినట్టు కాగా శ్రీదేవి కూడా ఒళ్ళు మరుస్తూ "అక్కడ అక్కడ!!" అన్నది విశాలాక్షి బొడ్డు కొంగుముడి ఉండే ప్రదేశంలో యెత్తు చూపిస్తూ.

సూర్యం ఒకసారి ఆ చూపబడిన ప్రదేశం వంక పరిశీలనా దృక్కులనూ, వేరొకసారి వదిన గారి ముఖంలోకి పుంఖాను పుంఖాలుగా చిమ్మబడే అమ్ములులా తీవ్ర దృక్కులనూ బరపి చప్పున తల్లి దగ్గరకు పోయి ఆమెను రెక్క పట్టుకొని లాక్కువస్తూ–

"చూడు అక్కడ. అక్కడ ఏమి ఉన్నదో తియ్" అన్నాడు పెద్ద గొంతుతో.

ఈసారి ఆ మంటలు వెంకటనర్సమ్మ గారిలో కూడా రగుల్కొనగా ఆమె చప్పున లేచివస్తూ "ఏమున్నదే – అక్కడ ఏమున్నదీ?" అంటూ ఒక వంక సూర్యం వేయలేని ప్రశ్నను అతి సహజంగా వేసి, కూతురు పొట్ట భాగాన్ని తన అరచేతితో స్పృశింపసాగారు.

ఆ తల్లి చేతికక్కడ ఏ వస్తువైనా ఉన్న స్పర్శ తగిలిందో, లేక ఏమీ తగలలేదో ఆ సంగతంతా దేవుడికి తెలియాలి ఆమెకు తెలియాలి. ఇంతలో కోడలి మాటలు ఆమె కర్ణరంధ్రాలలో బల్లేల్లా వచ్చి నాటుకో సాగాయి!

"నా గొలుసు ఉన్నదక్కడ. మొన్నరాత్రి లగ్నానికి ముందుగా తొమ్మిది పది గంటలప్పుడు మీ కూతురు పెరట్లో చెమటలు పోస్తూ కూర్చోవ టానికి కారణం అదే. నా గొలుసు పోయింది. కావలస్తే మీ అబ్బాయి నడగండి. అది ఈవిడే తీసింది. ఆ రాత్రి ఎక్కడోదాచి ఇప్పుడిల్లా అందరం పడుకున్నప్పుడు బయట నుండి తెస్తోంది. ఆ గొలుసు ఆవిడ బొడ్డు కొంగున దోపింది. తియ్యండి కావలిస్తే!"

ఇట్లా ఉచ్చస్వరంతో అరుస్తూనే ఆమె ఆ ఆడబడుచును తానే సోదా చేయడానికలా మీది మీదికి వచ్చింది.

ఏ అత్తగారైనా, ఎట్టి అవధులను కోడలు దాటబోతే సహించదో, అట్టి అవధులను శ్రీదేవి దాటడం వల్లనే పట్టుకోలేకపోయారో, లేక తమ కూతురికి బహిరంగంగా జరిగిన ఆ అవమానానికి అంత బహిరంగం గానే ప్రత్యవమానం జరిపి తీరాలనే ఉద్రేకం వల్లనే పట్టలేక పోయారో లేక ఇంక ఏ ఇతర కారణమైనా ఉన్నదో తెలియదు. – వెంకట నర్సమ్మ గారు ఆ మాటలు వినగానే ఆ పెండ్లివారి విడిది ఇంట తమ స్థితి ఏమో, తామెక్కడ ఉన్నారో, తమ నా పరాయి గ్రామంలో ఆ క్షణాన ఎంతమంది గమనిస్తున్నారో, దాని ఫలితమేమో – సమస్తం మరచి బజారు స్త్రీలకన్నా నికృష్టమైన వీరావేశంతో తమకు గల గొంతుకునల్లా ఉపయోగించుకుంటూ –

"ఎవ్వరివే నువ్వు! నా కూతురికి దొంగతనం కడతావా!?" అంటూ ప్రారంభించి, ఆడినమాట ఆడకుండా, తిట్టిన తిట్టు తిట్ట కుండా ఎన్నెన్ని విధాల ఋణాయించాలో అన్నన్ని విధాలా ఋణా యిస్తూ, అంత ఒళ్ళూ కదుల్చుక తిరగడంలో పరమ ఆయాసపడి పోతూ, కోడలిని నెట్టుకు నెట్టుకుని పెరట్లోకి తీసుకు పోసాగింది.

ఇంతవరకూ శ్రీరామారావు వీధి వంక వరండాలో ఒక చివర బాగా గాలి తగులుతుందని అక్కడ పరుపు వేయించుకొని పండుకొని ఉన్నాడు. ముందు రాత్రి హరికథ వల్లనైతేనేమి ఆ తరువాత కూడా ఏవేవో ఆలోచనల వల్లనైతేనేం అతడికి చాలినంత నిద్ర లేకపోయింది. అందుచేత అతడు అప్పుడు మంచి గాఢమైన నిద్రలో ఉన్నాడు. తల్లి గొంతుక వినిపించిన వెనుకగాని అతడికా గొడవలో పూర్తిగా తెలివి రాలేదు.

తెలివి వచ్చాక ఆ కలత నిద్దట్లో లేచి పరుగెత్తుక వచ్చేసరికి ఇల్లల్లా యెంతో భీభత్సంగా కనుపించింది.

అతడు "ఏమిటేమి"టంటూనే ద్వారం వద్ద మూగుతున్న జనాన్ని చీల్చు కొని గదిలోకి వచ్చేసరికి అక్కడ విశాలాక్షికి ఎవరో శైత్యోపచారాలు చేస్తున్నట్టూ, పెరటి వరండాలో తల్లీ భార్యా కొట్లాడుకొంటున్నట్టూ, ఇద్దరు ముగ్గురు వాళ్ళను విడిపిస్తున్నట్టూ నిరూపించే దృశ్యాలు కానవస్తున్నవి. ఆ మానవుడు అట్లాంటి వానిని దర్శించే స్థితి ఒకటి ఎప్పుడైనా సంభవించ వచ్చునని కలలో కూడా పొరపాటునైనా ఊహించి ఉండలేదు. అందుచేత అది ఇలా నిజమైనట్టు తన చర్మచక్షువులకు ప్రత్యక్షంగా కానవస్తూ ఉంటే అతడొక విధమైన దిగ్భ్రాంతి పొంది, ఆ దిగ్భ్రాంతిలో సమస్తమైన చైతన్యాన్నీ నిశ్శేషంగా కోల్పోయి మాటగాని, చలనంగాని లేకుండా అట్లా దిష్టిబొమ్మలా నిలిచిపోయాడు.

మరి ఒక అరనిమిషం కూడా అట్లానే గడచిపోయింది.

ఈలోగా ఎందరెందరో ఇరుగు పొరుగుల వారు 'జామ్'మంటూ మురికి పదార్థంపై వాలే ఈగలులాగ వచ్చి ద్వారం చుట్టూ మూగ సాగారు. వాళ్ళల్లో కొందరు మొట్టమొదట ఆ వదినా మరుదుల పెద్ద పెద్ద గొంతుకలు వినిపించినది లగాయితూ అక్కడకు ఆకర్షింపబడ్డ వారున్నారు. మరి కొంతమంది వెంకటనర్సమ్మ గారి గొంతు వినిపించాక మాత్రమే అక్కడకు వచ్చినవారు వున్నారు. అయినా వీళ్ళకూ, వాళ్ళకూ కూడా అక్కడ జరిగినదంతా – అమూలాగ్రం – ఆకళింపు అయి పోయింది. వ్యగ్రమయ్యాక మానవుని బుద్ధికి ఏర్పడే గ్రహణశక్తీ, మనస్సునకు ఏర్పడే అన్వయశక్తీ ఇంతింత అనరానివి. వాటి సహాయంతో వాళ్ళు జరిగినదేకాక జరుగుతున్న దానిని కూడా సమస్తం అర్థం చేసుకో గలుగుతున్నారు.

అన్నకన్నా ముందుగానే తెలివి పుచ్చుకున్న సూర్యం అన్నరాకను గుర్తించిన వెనుకనే తల్లిని వదినగారి నుండి బలవంతంగా వేరు చేయడం ఆరంభించాడు. వెంకటనర్సమ్మ గారి వీరావేశం పట్టశక్యం కాకుండా ఉన్నది. అయిదారుగురు ఆడవాళ్ళు పట్టుకోజూచినా ఆమె అంతమందినీ విడిపించుకుపోయి శ్రీదేవిని మొత్తుతూనే వచ్చింది. ఆసరికి చాలా దెబ్బలు తిన్న శ్రీదేవి చిన్నపిల్లలా ఏడుస్తూ దూరదూరంగా పెరట్లోకి పోతూ ఉన్నది. శ్రీరామారావు పాపం అలా కొయ్యగట్టిపోయి నిలుచుండిపోయాడే కాని ఇలా పెదవైనా కదపలేదు.

ఇంతలో ఎలా వచ్చాడో దేవుడిలా వచ్చాడు సూర్యం చినబావమరిది. అతడు వస్తూనే ముందుగా చేసినపని బయటి వాళ్ళనందరినీ పంపించేసి వీధి తలుపులు రెండూ సీదాగా మూసివేయడం. తరువాత అతడు శ్రీరామారావును వెతికి పట్టుకొని అతడికి పూర్తిగా తెలివి తెప్పిస్తూ "దయ చేసి తమరొక్కసారి నాతో ఇలా వస్తారా" అని తమ జవాబు కోసరం ఎదురు చూడకుండానే ఆయన రెక్క దొరకబుచ్చుకొని వీధి తలుపు తెరచి మళ్ళా మూసేస్తూ – ఒంటిపై కమీజైనా లేని శ్రీరామారావును లుంగీ బనియన్లతోనే – అటూ ఇటూ వాకిళ్ళనిండా నిలుచున్న జనం మధ్యనుండి, వాకిటి భోజనాలు చేస్తున్న మనుష్యుల మధ్య నుండి – తమ ఇంటిలోనికి తీసుకొనిపోయి అక్కడ తన గదిలో ఒక పడకకుర్చీపై సుఖాసీనుణ్ణి చేశాడు. తరువాత క్షణకాలం యేం చెయ్యడానికీ తోచనివాడిలా అటూ ఇటూ చూశాడు. అప్పుడకస్మాత్తుగా –

"నేనిప్పుడే వస్తాను. మీరు మరేం అనుకోకండి. నేనంతా సర్ది పెడతాను. మీరిక్కడ కూర్చోండి".

అని అంటూనే అక్కడ నుండి చూస్తూ ఉండగానే క్షణంలో మాయ మయ్యాడు.

శ్రీరామారావు రహస్యగోపన యత్నం ఆవిధంగా ఒక్కక్షణంలో పూర్తిగా పటాపంచలయ్యింది.

తరువాత కూడా ఇంక ఏం జరిగిందీ అంటే అదంతా వెనుకటిది వివరించి నంతగా వివరించి చెప్పడం చాలా కష్టం – కాక అనవసరం కూడానేమో. ఈ విషయమంతా ఆయా ఊళ్ళల్లో తెలిసిన వాళ్ళను ఎవరిని అడిగినా ఇలానే చెప్తారు. సూర్యం చినబావమరిది ఎట్లానో పొద్దుపోయే సరికి విడిది వద్ద అల్లకల్లోలాన్నంతా చక్కజేయగలిగాడు. ఆ రాత్రి సుముహూర్తం కూడా నెమ్మదిగా అయిందన్న పద్ధతిని జరిపించేసే ఏర్పాటు చేశాడు. 'కడివెడు పాలల్లోనూ ఒక్క మజ్జిగచుక్క' అని నిట్టూర్చారు బంధువులు అంతా. శ్రీరామారావు మాత్రం ఆ పూట పూటల్లా తానున్న గది విడిచిపెట్టి బయటికి రాలేదు. తక్కిన వాళ్లంతా ఆ రాత్రి ఎట్లా గడిపినా శ్రీరామారావు దానినొక కాళరాత్రిగా గడిపాడు.

క్షణక్షణం చెదిరిపోయే శాంతాన్ని కూడదీసుకుంటూ పరిపరివిధాల పరుగులు వారే మనసు పట్టుకుంటూ పది పదకొండు గంటలు ఒంటరిగా ఆ గదిలో ఎట్లా గడిపాడో, దానికెంత నిగ్రహశక్తి కావలసి వచ్చిందో అది అంతా అతడికే తెలియాలి. నిశినిశ్శబ్దంగా యుగ యుగాలుగా గడిచి పోతూ వచ్చింది అతనికి. మూడు మూడున్నర గంటలవేళ చిన్న మగత నిద్దర పట్టింది అతడికి తెలియకుండానే. మళ్ళా తెలివి వచ్చేసరికి గదిలో బెడ్‌లైటు ఇంకా వెలుగుతూనే ఉన్నది – బయట ముని ముని చీకటిగా ఉన్నది – తనను ఎవరో లేపుతున్నారు. తననెవరో నిద్రలేపారనీ వాళ్ళేదో చెపుతున్నారనీ – ఆ సంగతులన్నీ గ్రహించడానికి శ్రీరామారావుకు చాలాసేపు పట్టింది. తెలివి వచ్చాక "విశాలాక్షి! విశాలాక్షి నూతిలో పడ్డది!" అని లేపవచ్చిన వాళ్ళు చెపితే శ్రీరామారావు కొంతసేపు మాట్లాడ కుండా అట్లానే ఉండిపోయి తరువాత ఏడుస్తూ మంచం మీద పండుకొండి పోయాడు. ఆ దెబ్బకాదెబ్బ కాగా అతడు శారీరకంగా కోలుకోవడానికే పది పదిహేను రోజులు తీసుకొని మానసికంగా కోలుకోవ డానికి యింకో ఆరేడు మాసాలూ అంతకుపైగా కూడా తీసుకున్నాడు.

నిండా ఒక సంవత్సరం అయ్యాకగాని జరిగిందేమిటో, జరగనిదేమిటో తేల్చుకోలేక పోయాడు ఆ లెక్చరర్. అప్పుడిక చూస్తే అదంతా అతని మనస్సుకు ఈవిధంగా అనిపిస్తూ ఉండేది.

విశాలాక్షి మరణానికి కారణమయిన పరిస్థితులకన్నా ఘోరమయినది ఆమె మరణించిన పద్ధతి. ఆమె మరణించిన పద్ధతికన్నా అత్యంత విహ్వలతా జనకములు దాని ఫలితంగా ఆ కుటుంబం వాళ్ళందరూ ఎదుర్కోవలసి వచ్చిన ప్రభునిందా, లోకనిందా, వాని నిరసనా వైఖరీ మొదలైన విషయాలు. వీటి అన్నింటికన్నా ఘోరమయిన విషయం ఆమె మరణించడంలో గల అసలు ఆంతర్యాన్ని గురించి శ్రీరామారావులో ఏర్పడి వున్న భావం.

విశాలాక్షి లోకంలో ఎవ్వరోగాని చావలేనంత ఘోరమయిన చావు చచ్చింది – శ్రీరామారావుకు తెలిసినంత మేరకు. ఆమె ఉరికిన విడిది ఇంటి పెరట్లో గల నూతిలో నీళ్ళు చాలా తక్కువ. అడుగుభాగం కూడా రాతినేల అవడం వల్ల ఆమె కాళ్ళూ వెన్నుపూసా మొదలైనవి విరుచు కున్నదే కాని కోరినవిధంగా చావలేక పోయింది. ఉరకటంలో గట్టుకు ఒరుసుకుని పోయి తలపైనా అక్కడా పెద్ద పెద్ద పెచ్చులుగా చర్మం ఊడిపోయింది. చివరకు ఆమె కోసమే దాపురించిందా అన్నట్లు ఆ మంచినీటి నూతిలో ఆహారం కోసరం చేరి ఉన్న

ఒకానొక నాగుపాము వాతపడి మరణించింది పాపం విశాలాక్షి. లోకంలో అంతకన్నా ఘోరమయిన చావు ఎక్కడైనా ఉన్నదేమో శ్రీరామారావుకు తెలియదు.

అట్లానే విశాలాక్షి చావు తరువాత దాని ఫలితంగా ఆ కుటుంబం వాళ్ళు ప్రతి ఒక్కరూ – చివరకు కొత్త పెళ్ళికూతుర్ని కూడా కలుపుకొని – ఎదుర్కోవలసి వచ్చిన విషమ పరిస్థితులు అన్నీ ఏతన్మాత్రాలు కావు. ఆమె నూతిలో ఉరికిన విషయం సకాలానికి తెలియక పోవడం వల్ల ప్రాణరక్షణ యత్నాలు అసంభవమయినట్లే, తక్కిన కర్మకాండ కూడా యధావిధిగా జరిపించటం అసాధ్యమయ్యింది. పోలీస్ రిపోర్టులూ, పోస్టుమార్టం వ్యవహారాలూ, కేసుల్తో జడిపించడం, లంచాలూ – అది అంతా ఒక చిత్రక్షోభగా గడిచిపోయింది. ఆ తరువాత మూడు నాలుగు నెలల వరకూ ఆ యింట్లో వాళ్ళు ఒక్కరు కూడా ముఖమెత్తుకొని బయట నలుగురి మధ్యా తిరగలేక పోయారు. శ్రీరామారావు మట్టుకు అసలు కాలేజీ పాఠం చెప్పడానికి సహితం తల ఎత్తవలసి వస్తే ఆరేడు మాసాల వరకూ ఎక్కడ లేని బాధకూ గురి అయ్యేవాడు. పేపర్లలో పడి ఈ విషయం 'దేశదేశాల' వరకు వ్యాపించిందంటే అది ఆ కుటుంబంపై ఎంత పెద్ద దెబ్బ తీసిందో స్పష్టంగా అర్థమౌతుంది. లోకం వాళ్ళ దోషాలనన్నిటినీ ద్విగుణీకరించి త్రిగుణీకరించి వాళ్ళ కుటుంబ చరిత్రను ఆమూలాగ్రం – దానిలో వుండే సమస్తమయిన అవలక్షణాలతోనూ, గుచ్చెత్తి మళ్ళా మళ్ళా చెప్పుకొన్నది. ఈ సందర్భంలో కొత్త పెళ్ళికూతురి దక్షిణపాద మహిమను గురించి గూడా చర్చించడం వారు మరిచిపోలేదు –

అన్నింటికన్నా బాధాకరమైన విషయం విశాలాక్షి చావు యొక్క ఆంతర్యాన్ని గురించి శ్రీరామారావుకు అతనిలో లోతుగా ఏర్పడిపోయి వున్న భావాల రూపు. ఆమె ఆత్మహత్య చేసుకున్నా, ఆత్మత్యాగం చేసుకొన్నా అది అతడికి అంత ఆట్టే కష్టమనిపించే విషయం కాకపోను అనుకుంటాడు అతడు. విశాలాక్షి తన ఇచ్ఛకు విరుద్ధంగా, తనపై తనకు కోపం వచ్చి కాకుండా తనకంతటి తీరని తీవ్రమైన మహావమానం జరిగిందనే ఉక్రోషంతో – పట్టరాని ఆ అవమానాన్ని భరించలేక మరణించి ఉంటుందని శ్రీరామారావు భావన. ఆమె ఆత్మ ఇప్పటికీ తొందరపడి తాను చేసిన ఆ పొరపాటునకు ఇంతింత అనరాని కుందుతో బాధపడుతూ ఉంటుందనే శ్రీరామారావు గాఢమయిన విశ్వాసం. ఆమెకు తాను కనుక్కొన్న అభం, శుభం ఎరగని అందమయిన ఆ నలుగురు ఆడ పిల్లల మీదా, అంతకన్నా ఆదినుండీ ఎడతెగని లోక తిరస్కృతికి గురి అవుతూ వస్తున్న నిర్భాగ్య జీవి తన భర్తమీద కల వాత్సల్యాభిమానాలు ఎంతో గాఢమయినవని శ్రీరామారావు అర్థం చేసుకొని ఉన్నాడు. అందుచేత తనయొక్క చైదానికి ఫలితంగా మొదలే వికలములైన వాళ్ళ భవిష్యత్తులు మరింత వికలములు కాగలవని గ్రహిస్తూ, అది మరల మరల తలచుకొంటూ ఆ ఆత్మ ఎన్నటికీ ఏం చేసి కూడా నిశ్చింతగా ఉండలేదని శ్రీరామారావు నమ్మిక.

ఇట్టి భావాలతో శ్రీరామారావు ఆలోచించుకపోతూ ఉంటే ఆ ఆలోచనలకు అతడిలో అంతు ఉండేది కాదు.

అయితే ఇన్ని ఆలోచించీ శ్రీరామారావు ఎన్నడూ ఆలోచించక విడిచిన విషయాలు కూడా ఒకటి రెండు ఆలోచించవలసినవి మిగిలిపోయి వున్నవి.

విశాలాక్షి ఏ ఉద్దేశంతో ఎలా ఆలోచించి తనకు దొరికిన నగను తన వద్ద మాటాడక ఉంచేసుకొని వున్నది. ఆ నగను ఏం చేద్దామని ఆమె అభిప్రాయమై వుండాలి?

లోకగతిలో ఇట్లాంటి సంఘటనలన్నీ ఒక పెద్ద లెక్కలోకి వచ్చే విషయాలు కాకపోయినా వ్యక్తులను వ్యష్టిగా తీసుకొని చూస్తే కొందరి కొందరి జీవితాలను ఎంతో అస్తవ్యస్తములుగా మార్చగలిగే ఇంతటి పెద్ద సంఘటనలు కొన్ని కొన్ని కుటుంబాలలో అప్పుడప్పుడూ జరుగుతుండటానికి అసలు మూల కారణాలు – వాటి కుదుళ్ళు – ఏమిటి? ఎక్కడ వున్నవి?

ఈ రెండే అతడు ఎన్నడూ పరిశీలించని విషయాలు – లేక పరిశీలించాలనే స్ఫురణకు గురికాని విషయాలు!

★

*(భారతి : ఏప్రిల్, 1955)*